



# నీలగిరి ఎక్స్‌ప్రెస్


RNI - TELTEL/2023/87644

తెలుగు దిన పత్రిక



## విలేకరులు కావలెను

తెలంగాణ &ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రాలలో (నీలగిరి ఎక్స్ ప్రెస్): & చైతన్య గళం ఛానల్ లో పని చేయుటకు
- బ్యూరో ఇన్చార్జ్ లు- జిల్లా స్టాఫ్ రిపోర్టర్ లు -ఇన్చార్జ్ లు
- మండల రిపోర్టర్ లు
- క్రైమ్ రిపోర్టర్ లు
-జిల్లాల వారిగా ఆడ్ ఇన్చార్జ్ లు కావలెను. వివరాలకు మా WHATS APP నంబర్:- 9705770909 సంప్రదించండి.



సంచిక : 247 | సంపుటి : 3 | తెలంగాణ | ఆంధ్రప్రదేశ్ | ఆదివారం | 28-12-2025 పేజీలు-8 | వెల: రూ. 5.00


## నకిలీ ఏజెంట్లతో జాగ్రత్త

హెచ్-1బీ వీసా దరఖాస్తుదారులకు అమెరికన్ ఎంబసీ హెచ్చరిక




2 లో

## పాక్‌తో అప్రమత్తంగా ఉండాల్సిందే

- పాక్ సైనిక వ్యూహాలను తేలికగా తీసుకోరాదు
- కాంగ్రెస్ సీనియర్ నేత శశిథరూర్ కీలక వ్యాఖ్యలు



2 లో

## హైస్పీడ్ రైళ్లలో చైనా మరో ప్రపంచ రికార్డు..

- 2 సెకన్లలోనే 700km/h వేగాన్ని అందుకున్న రైలు..
- మాగ్లెవ్ రైలుతో చైనా అద్భుతం





## తెలుగు రాష్ట్రాల్లో పెరిగిన చలి

- పడిపోతున్న కనిష్ట ఉష్ణోగ్రతలు
- అప్రమత్తంగా ఉండాలని హెచ్చరిక

**హైదరాబాద్,**
ఉభయ తెలుగు రాష్ట్రాల్లో చలి తీవ్రత రోజురోజుకూ ప ఎరుగుతోంది. రాత్రి ఉష్ణోగ్రతలు గణనీయంగా పడిపోతున్నాయి. దీంతో అప్రమత్తంగా ఉండాలని అధికారులు హెచ్చరించారు. గత పదేళ్లలో ఎక్కువ రోజులు తీవ్రమైన చలి కమ్ముకున్నది ఈసారి శీతాకాలంలోనే అని వాతావరణ నిపుణులు చెబుతున్నారు. దాదాపు నెల రోజులుగా కనిష్ఠ ఉష్ణోగ్రతలు బాగా తక్కువగా నమోదవుతున్నాయి. ఉమ్మడి మెదక్, ఆదిలాబాద్, రంగారెడ్డి, నిజామాబాద్ జిల్లాల్లోని పలు ప్రాంతాల్లో ఆరేడు డిగ్రీలకు పడిపోతున్నాయి. హైదరాబాద్‌లోనూ ఈసారి చలి తీవ్రత చాలా ఎక్కువగా ఉంది.ఇంట్లో వెచ్చగా, బయట చలిగా ఉంటే... ఆ తర్వాత ఇంట్లో చలి వేస్తోంది, బయటికెళితే మాత్రం కాస్త ఉపశమనం అనిపిస్తోంది. శీతల గాలులు, మన ఇళ్ల గోడలే దీనికి కారణమని నిపుణులు చెబుతున్నారు. ఉత్తర వాయవ్య దిశ నుంచి వీస్తున్న శీతల గాలులతో రాష్ట్రంలో ఉష్ణోగ్రతలు బాగా పడిపోయాయి. దీనితో ఇళ్ల కాంక్రీటు గోడలు, శ్లాబులు రాత్రంతా చల్లబడి చలి పెరుగుతోంది. ఇళ్ల గోడలు, శ్లాబ్ నుంచి రోజంతా చల్లదనం వెలువడుతోంది. దీనితో ఇంట్లో చలివేస్తోంది. పై అంతస్తు, ఆపైన ఉండే వారికి శీతలగాలుల ప్రభావంతో మరింత ఎక్కువగా చలి ఉంటోంది. మరోవైపు ఆకాశంలో మేఘాలు లేకపోవడంతో, గాలిలో తేమశాతం తక్కువగా ఉంటుండటంతో సూర్యకిరణాలు నేరుగా

-మిగతా 2 లో

# జనవరి 5 నుంచి ఉపాధి బచావో అభియాన్

## కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ నిర్ణయం

- మోడీ ప్రభుత్వంపై ప్రజల ఆగ్రహం
- రాష్ట్రాలు, పేదలపై విధ్వంసకర దాడి
- విలేకరుల సమావేశంలో మల్లికార్జున్ ఖర్గే, రాహుల్ గాంధీ
- ఈ సమావేశంలో పాల్గొన్న ముఖ్యమంత్రులు ఎ.రేవంత్ రెడ్డి, సిద్దరామయ్య, సుఖ్‌వీందర్ సింగ్ సుఖ్,

**న్యూఢిల్లీ డిసెంబర్ 27 (నీలగిరి ఎక్స్ ప్రెస్)**
గ్రామీణ ప్రజల జీవనోపాధిలో కీలకపాత్ర పోషించిన మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం (ఎంజీఎన్‌ఆర్‌ఈజీఏ) రద్దుకు వ్యతిరేకంగా జనవరి 5 నుంచి కాంగ్రెస్ దేశవ్యాప్తంగా ఆందోళన నిర్వహించనుంది. ఈ మేరకు శనివారం నాడిక్కడ కాంగ్రెస్ ప్రధాన కార్యాలయం (ఇందిరా భవన్)లో జరిగిన కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ (సీడబ్ల్యూసీ) సమావేశంలో నిర్ణయం తీసుకున్నారు. ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే అధ్యక్షత నిర్వహించిన ఈ సమావేశంలో ప్రతిపక్షనేత రాహుల్ గాంధీ, కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ నేత సోనియా గాంధీ, తెలంగాణ, కర్నాటక, హిమాచల్ ప్రదేశ్

-మిగతా 2 లో




## డ్రగ్స్ కేసులో నిర్లక్ష్యం ఎందుకు?

- అకున్ సబర్వాల్‌ను తిరిగి నియమించండి
- మాజీ సిఎస్ సోమేశ్ కుమార్‌ను విచారించండి
- రాష్ట్రం తీరుపై కేంద్రమంత్రి బండి సంజయ్ ఆగ్రహం



**హైదరాబాద్,డిసెంబర్ 27 (నీలగిరి ఎక్స్ ప్రెస్)**
రాష్ట్ర ప్రభుత్వం డ్రగ్స్ కేసులను తీవ్రంగా పరిగణించడంలేదని కేంద్ర హోంశాఖ సహాయమంత్రి బండి సంజయ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. కేవలం పండుగలు, నూతన సంవత్సర వేడుకల సమయంలోనే డ్రగ్స్ కేసుల నమోదుకు పరిమితమవుతున్నారని ఆక్షేపించారు. కేసీఆర్ ప్రభుత్వ హయాంలో అకున్ సబర్వాల్ ఆధ్వర్యంలో జరిపిన 'డ్రగ్స్ కేసు' విచారణ నివేదికపై రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని బండి సంజయ్ ప్రశ్నించారు. ఈమేరకు డ్రగ్స్ కేసులపై బండి సంజయ్ కుమార్ సంచలన వ్యాఖ్యలు చేశారు. పండుగల అప్పుడే డ్రగ్స్ కేసులు నమోదు చేస్తారా?

-మిగతా 2 లో

## ఆర్ఎస్ఎస్ సంస్థ కాదు.. దేశానికి పట్టిన విషం

- కార్పొరేట్ల దోపిడీ ఆగాలంటే నిరంతర పోరాటాలు జరగాలి
- సినీ నటుడు ప్రకాశ్‌రాజ్



2 లో

## దళితుల భూమిని దౌర్జన్యంగా లాక్కుంటారా

- దుందిబీ నదిలో కాంగ్రెస్, బిఆర్ఎస్ నేతల ఇసుకదోపిడీ
- తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత



**నాగర్ కర్నూల్ డిసెంబర్ 27 (నీలగిరి ఎక్స్ ప్రెస్)**
:మెడికల్ కాలేజీకి 40 ఎకరాల దళితుల భూములను దౌర్జన్యంగా లాక్కున్నారని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ఆరోపించారు. కాంగ్రెస్ పాలనలో కాంట్రాక్టర్లకు అడ్వాన్స్‌డ్ కల్చర్‌ని సీఎం రేవంత్‌రెడ్డి తీసుకువచ్చారని ఆక్షేపించారు. దుందిబీ నదిలో బీఆర్ఎస్, కాంగ్రెస్ నేతలు పోటాపోటీగా ఇసుక దోపిడీ చేస్తున్నారని ఆరోపణలు చేశారు. ఈమేరకు

-మిగతా 2 లో

## పింఛన్ పైసలతో ఢిల్లీకి మూటలు



- రేవంత్ ఒక్క భాషలో తిడితే.. నాకు నాలుగు భాషలు వచ్చు
- సర్పంచుల నిధులు ఎవరూ ఆపలేరు
- సెమీఫైనల్.. ఫైనల్ ఎన్నికలు ముందున్నాయి
- మహబూబాబాద్‌లో సర్పంచ్‌ల సన్మానంలో
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

**మహబూబాబాద్ – డిసెంబర్ 27 (నీలగిరి ఎక్స్ ప్రెస్)**
"రాష్ట్రంలో రైతులకు రెండు సార్లు రైతుబంధు ఎగ్గొట్టిన దొంగ సీఎం రేవంత్ రెడ్డి.. మాయ మాటలు చెప్పి ప్రజలను మోసం చేసి అధికారంలోకి వచ్చారు. పేదలకు పెంచి ఇవ్వాల్సిన పింఛన్ డబ్బులను ఢిల్లీకి మూటలు కట్టి పంపిస్తున్నారు" అని బీఆర్ఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ వ్యాఖ్యానించారు. శనివారం మహబూబాబాద్‌లో బీఆర్ఎస్ సర్పంచ్‌లకు సన్మాన కార్యక్రమం నిర్వహించారు. బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు మాలోతు కవిత అధ్యక్షతన జరిగిన సమావేశంలో కేటీఆర్ ప్రసంగించారు. అధికార కాంగ్రెస్ పార్టీ ఎన్ని కుతంత్రాలు చేసినా బీఆర్ఎస్

-మిగతా 2 లో

## 15 శాతం తగ్గిన నేరాలు



- అత్యాధునిక టెక్నాలజీతో మెరుగైన సేవలు
- సంధ్య థియేటర్ ఘటనలో 100పేజీల చార్జీషీట్
- డ్రగ్స్, డ్రంకెన్ డ్రైవ్‌పై ఉక్కుపాదం
- నార్కోటిక్ బృందాలను మరింత బలోపేతం చేస్తాం
- హైదరాబాద్ సీపీ విసి.సజ్జనార్

**హైదరాబాద్, డిసెంబర్ 27 (నీలగిరి ఎక్స్ ప్రెస్)**
నేర నియంత్రణలో అత్యాధునిక టెక్నాలజీతో మెరుగైన ఫలితాలు సాధించామని, గతేడాదితో పోల్చితే ఈ ఏడాది 15శాతం నేరాలు తగ్గాయని హైదరాబాద్ సీపీ విసి.సజ్జనార్ తెలిపారు. గతేడాదితో పోల్చితే మహిళలు, చిన్నారులపై మాత్రం నేరాలు పెరిగాయన్నారు. హైదరాబాద్ బంజారాహిల్స్‌లోని ఐసీసీసీలో శనివారం విలేకరుల సమావేశంలో 2025 వార్షిక నేర నివేదికను సీపీ విడుదల చేశారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ.. మాదకద్రవ్యాలు, నకిలీ వస్తువులు, విత్తనాల నియంత్రణపై డీసీపీ స్థాయి అధికారి పర్యవేక్షణలో ప్రత్యేక టీమ్స్‌ను ఏర్పాటు చేస్తామన్నారు.

-మిగతా 2 లో

నీలగిరి ఎక్స్‌ప్రెస్
తెలుగు దిన పత్రిక

ఆదివారం 28 డిసెంబర్ 2025

# హైస్పీడ్ రైళ్లలో చైనా మరో ప్రపంచ రికార్డు..

- 2 సెకన్లలోనే 700km/h వేగాన్ని అందుకున్న రైలు..
- మాగ్లెవ్ రైలుతో చైనా అద్భుతం



**న్యూఢిల్లీ,-**
హైస్పీడ్ రైళ్లలో డ్రాగన్ దేశం చైనా మరో ప్రపంచ రికార్డు నెలకొల్పింది. మాగ్నెటిక్ లెవిటేషన్ టెక్నాలజీతో నడిచే మాగ్లెవ్ రైలు ను పరీక్షించింది. ఈ రైలు రెండు సెకన్లలోనే గంటకు 700 కిలోమీటర్ల వేగాన్ని అందుకుంది. రైలు వేగాన్ని చూసి అక్కడి అధికారులు, మీడియా ప్రతినిధులే ఆశ్చర్యానికి గురయ్యారు. 700 km/h వేగాన్ని అందుకున్న తర్వాత రైలును అధికారులు సురక్షితంగా ఆపగలిగారు. ఇది అత్యంత వేగవంతమైన సూపర్ కండక్టింగ్ ఎలక్ట్రిక్ మాగ్లెవ్ రైలుగా నిలిచింది. రైలు ట్రయల్ రన్స్‌కు సంబంధించిన వీడియో ప్రస్తుతం వైరల్ అవుతోంది.

# పాక్‌తో అప్రమత్తంగా ఉండాల్సిందే

**పాక్ సైనిక వ్యూహాలను తేలికగా తీసుకోరాదు**
**కాంగ్రెస్ సీనియర్ నేత శశిథరూర్ కీలక వ్యాఖ్యలు**



**న్యూఢిల్లీ,-**
కాంగ్రెస్ సీనియర్ నేత శశిథరూర్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఆపరేషన్ సిందూర్ తరవాత మరింత అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం వచ్చిందన్నారు. పాక్‌ను తక్కువ అంచనా వేయకుండా అప్రమత్తంగా ఉండాలని, అలాగే దానిని నమ్మడానికి లేదన్నారు. పాకిస్థాన్‌లో మారుతున్న సైనిక వ్యూహాలు, అభివృద్ధి చెందుతున్న హైపర్ సోనిక్ క్షిపణి వ్యవస్థలను.. భారత్ తేలిగ్గా తీసుకోకూడదని హెచ్చరించారు . ఓ వార్తా సంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో మాట్లాడుతూ థరూర్ ఈ వ్యాఖ్యలు చేశారు. పాక్‌తో ఉన్న గత అనుభవాల నుంచి భారత్ చాలా నేర్చుకున్నందున ఏ పరిస్థితినైనా ఎదుర్కొనేందుకు పూర్తి సిద్ధంగా ఉండాలన్నారు. డ్రోన్లు, రాకెట్లు, క్షిపణుల తర్వాత హైపర్‌సోనిక్ సాంకేతికతపై పాక్ దృష్టిసారించిందన్నారు. ఇది భారత్ తేలికగా తీసుకునే విషయం కాదన్నారు. పాక్‌లో ప్రజాస్వామ్యం నామమాత్రంగానే ఉందని.. ఇప్పటికీ సైనిక ఆధిపత్యమే కొనసాగుతుందన్నారు. ఆర్థికంగా దుర్భర పరిస్థితిలో ఉన్న ఆ దేశం.. విదేశాల నుంచి అందే సాయంపైనే ఆధారపడుతుందని థరూర్ అన్నారు. ఇక, బంగ్లాదేశ్ దాని సొంత సమస్యలతో సతమతమవుతోందన్నారు. పాక్‌తో రక్షణ ఒప్పందానికి బంగ్లా చేస్తున్న చర్చల గురించి ప్రస్తావిస్తూ.. భారత్ మాకు శత్రువు అనే అభిప్రాయాన్ని కల్పించే ప్రయత్నం చేస్తున్నారన్నారు. పొరుగు దేశాల్లో పెరుగుతున్న భారత వ్యతిరేకతపై ఆయన మాట్లాడుతూ.. బంగ్లాలో స్థిరమైన, శాంతియుత వాతావరణం మనకు చాలా కీలకమన్నారు. ఈశాన్య రాష్ట్రాలను భారత్ నుంచి విడదీస్తామంటూ వస్తోన్న హెచ్చరికలపై ఆందోళన వ్యక్తం చేశారు.

# నకిలీ ఏజెంట్లతో జాగ్రత్త

**హెచ్-1బీ వీసా దరఖాస్తుదారులకు హెచ్చరిక**




**న్యూఢిల్లీ-**
హెచ్-1బీ వీసాల జారీ, రెన్యువల్ సత్వరమే చేయిస్తామంటూ కొందరు నకిలీ ఏజెంట్లు దరఖాస్తుదారులను మోసగిస్తున్నారని భారత్‌లోని అమెరికన్ ఎంబసీ హెచ్చరించింది. అమెరికన్ ప్రభుత్వం అమలు చేస్తున్న ఆంక్షల నేపథ్యంలో మోసగాళ్లు హెచ్-1బీ వీసా దరఖాస్తుదారులను సంప్రదిస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందని తెలిపింది. ఇటువంటి మోసగాళ్ల హామీలను నమ్మవద్దని హెచ్చరించింది. వీరిని నమ్మితే, ఆర్థిక నష్టంతో పాటు ప్రయాణ ప్రణాళికల్లో ఇబ్బందులు ఎదురవుతాయని వివరించింది. వీసా అపాయింట్‌మెంట్లు అధికారిక వెబ్‌సైట్ల ద్వారా మాత్రమే షెడ్యూల్ అవుతాయని తెలిపింది. ఇతర మార్గాల్లో వీసా ఇప్పిస్తామని ఎవరైనా హామీ ఇస్తే, అది మోసపుచ్చడమే అవుతుందని పేర్కొంది. అధికారిక ప్రక్రియలో భాగంగా నిర్దేశించిన ఫీజు కంటే ఎక్కువ సొమ్మును చెల్లించాల్సిన అవసరం లేదని స్పష్టం చేసింది. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రభుత్వం సోషల్ మీడియా వెట్టింగ్ విధానాన్ని అమలు చేస్తున్నది. ఫలితంగా వీసా ఇంటర్వ్యూలు కొన్ని నెలలపాటు వాయిదా పడ్డాయి.

## ఆర్ఎస్ఎస్ సంస్థ కాదు.. దేశానికి పట్టిన విషం

**కార్పొరేట్ల దోపిడీ ఆగాలంటే నిరంతర పోరాటాలు జరగాలి**
**: సినీ నటుడు ప్రకాశ్‌రాజ్**

**విశాఖ :**
'వందేండ్ల ఉత్సవాలు ఆర్ఎస్ఎస్ చేసుకోవడానికి ఏం సాధించింది. దేశ స్వాతంత్ర్య ఉద్యమంలో వారు పాల్గొన్నట్టు ఒక్క పేరునైనా ఎవరైనా చెప్పగలరా? ఈ వందేండ్లలో వారు చెడ్డీల నుంచి ప్యాంటులకు వచ్చారు. మీకు కమలం పువ్వు పైకి కనిపిస్తోంది. నేను దాని కింద ఉన్న విషపు వేళ్లను చూసి చెబుతున్నాను. ఆర్ఎస్ఎస్, బీజేపీ ఈ దేశానికి పట్టిన విషం' అని ప్రగతిశీలవాది, ప్రముఖ సినీనటుడు ప్రకాశ్‌రాజ్ అన్నారు. భారతదేశం సరోవరం అయితే అందులో బ్రహ్మ రాక్షసుడు ఆర్ఎస్ఎస్ అని ఆయన వ్యాఖ్యానించారు. సీఐటీయూ అఖిల భారత మహాసభ సందర్భంగా శనివారం నుంచి వారం రోజులపాటు విశాఖలో తలపెట్టిన శ్రామిక ఉత్సవ్ ప్రారంభ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆయన సీఐటీయూ ఆధ్వర్యంలో విశాఖలోని దసపల్లా హొటల్‌లో నిర్వహించిన ప్రెస్‌మీట్‌లో మాట్లాడారు. తొలుత మీడియా వారు 'ఎలా వున్నారు సార్' అనగానే 'ఏముందన్నా కార్మికులు, వారికోసం పోరాడే వారంటే నాకెంతో ఇష్టం. సీఐటీయూ పిలవగానే విశాఖపట్నం వచ్చేశాను' అనడంతో అందరూ ఆనందం వ్యక్తం చేశారు. ఈ రోజు నుంచి వారంపాటు సాంస్కృతిక ఉత్సవాలు, ఆటాపాట, కవులు, రచయితలతో సందడిగా విశాఖ ఉంటుందని, సినిమా నటులను పిలవడం సహజం కదా అని ప్రకాశ్‌రాజ్ అంటూనే 'అయితే నేను నటుడిని మాత్రమే కాదు.. అభ్యుదయ ఆలోచనలు, ఆందోళనలకు అండగా ఉండే వ్యక్తిని' అని చెప్పుకొచ్చారు.

# జనవరి 5 నుంచి ఉపాధి బచావో అభియాన్

మొదటి తరువాయి

ముఖ్యమంత్రులు ఎ.రేవంత్ రెడ్డి, సిద్ధరామయ్య, సుఖ్‌వీందర్ సింగ్ సుఖ్, ప్రధాన కార్యదర్శులు కేసీ వేణుగోపాల్, జైరాం రమేశ్, సీడబ్ల్యూసీ సభ్యులు పాల్గొన్నారు. తొలుత మాజీ ప్రధానమంత్రి మన్మోహన్ సింగ్‌కు నివాళులర్పించారు. ఇటీవల మరణించిన కాంగ్రెస్ నేతలు శివరాజ్ పాటిల్, శ్రీప్రకాష్ జైస్వాల్‌కు రెండు నిమిషాలు మౌనం పాటించి నివాళు లర్పించారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మల్లికార్జున్ ఖర్గే మాట్లాడుతూ ఎంజీఎన్ఆర్ఈజీఏ రద్దుపై ప్రజలు ఆగ్రహంతో ఉన్నారని, దాని పరిణామాలను మోడీ ప్రభుత్వం ఎదుర్కోవాల్సి ఉంటుందని హెచ్చరించారు. దేశవ్యాప్తంగా "ఎంజీఎన్ఆర్ఈజీఏ బచావో అభియాన్"ను నిర్వహిస్తామన్నారు. వీబీ-జీ రామ్ జీ చట్టంతో రాష్ట్రాలపై అదనపు ఆర్థిక భారం పడుతోందని, రాష్ట్రాలు, రాజకీయ పార్టీలతో ఎలాంటి సంప్రదింపులు లేకుండా ఏకపక్షంగా నిర్ణయం తీసుకున్నారని విమర్శించారు. పేదలను అణచివేయడానికి తీసుకొచ్చిన ఈ చట్టానికి వ్యతిరేకంగా వీధుల్లో, పార్లమెంట్‌లో పోరాడుతామని హెచ్చరించారు. 2015లో భూ సేకరణ చట్ట సవరణలు, 2020-21లో రైతులు చారిత్రాత్మక పోరాటంతో మోడీ ప్రభుత్వం ఉపసంహరించుకున్న మూడు వ్యవసాయ చట్టాల వలే, దీన్ని ఉపసంహరించుకోవాల్సి వస్తుందన్నారు. స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (సర్) తీవ్రమైన సమస్య అని, దేశ ప్రజల ప్రజాస్వామ్య హక్కులను పరిమితం చేయడానికి మోడీ ప్రభుత్వం, కేంద్ర ఎన్నికల సంఘం కలిసి పన్నిన కుట్ర అని ధ్వజమెత్తారు. అత్యంత వెనుకబడిన




తరగతులు, దళితులు, గిరిజనలు, మైనారిటీ పేర్లను ఓటర్ జాబితా నుంచి తొలగించకుండా, ఇతర బూత్‌లకు బదిలీ చేయకుండా చూసుకోవాలని సూచించారు. దీనికి కోసం బూత్ స్థాయి ఏజెంట్లు ఇంటింటికీ వెళ్లాలన్నారు. కాంగ్రెస్ 'సంస్థా సృజన అభియాన్'ను కొనసాగిస్తామని తెలిపారు. 500 జిల్లాల్లో జిల్లా అధ్యక్షుల నియామకం పూర్తయిందని, బూత్ స్థాయి వరకూ పార్టీని బలోపేతం చేస్తున్నామని చెప్పారు. 2026లో రాష్ట్రాల్లో జరిగే ఎన్నికలకు కాంగ్రెస్ సిద్ధమని స్పష్టం చేశారు. ఈడీ, ఐటీ, సీబీఐల దుర్వినియోగం జరుగుతోందని, నేషనల్ హెరాల్డ్ కేసులో న్యాయ పోరాటం కొనసాగుతోందని తెలిపారు. బంగ్లాదేశ్‌లో హిందూ మైనారిటీలపై దాడులను ఆయన ఖండించారు. ఈ ఘటనపై దేశం మొత్తం ఆందోళన చెందుతోందన్నారు. బీజేపీ, ఆర్ఎస్ఎస్‌తో సంబంధం ఉన్న సంస్థలు క్రిస్మస్ వేడుకలపై చేసిన దాడులు మత సామరస్యాన్ని దెబ్బతీశాయని, ప్రపంచ వ్యాప్తంగా దేశ ప్రతిష్టకు కళంకం తీసుకువచ్చాయని విమర్శించారు.

**రాష్ట్రాలు, పేదలపై విధ్వంసకర దాడి**
మోడీ సర్కార్ రాష్ట్రాలు, పేద ప్రజలపై నోట్ల రద్దు మాదిరిగానే విధ్వంసకర దాడికి పాల్పడిందని ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ విమర్శించారు. ప్రభుత్వ చర్యను కాంగ్రెస్ ప్రతిఘటిస్తోందని, ఇందుకు ప్రతిపక్షాలన్నీ మద్దతిస్తున్నాయని స్పష్టం చేశారు. 2006లో ఆంధ్రప్రదేశ్‌లో ప్రారంభమైన ఈ పథకం గ్రామీణ భారత ముఖచిత్రాన్ని మార్చిందని, దళితులు, ఆదివాసీలు, మహిళలకు భరోసా ఇచ్చిందని, పేదరికం నుంచి బయటపడ్డ తరాన్ని సృష్టించిందని వివరించారు. 'పేదల కడుపుపై తన్నిన మోడీ ప్రభుత్వం,పేదల కంటే కార్పొరేట్ల లాభాలే ముఖ్యం' అని విమర్శించారు. ఎంజీఎన్ ఆర్ఈజీఏ కేవలం ఒక చట్టం కాదని, రాజ్యాంగం ఇచ్చిన పని హక్కు అని వెల్లడించారు. ఉపాధి హామీ చట్టానికి ప్రపంచ వ్యాప్తంగా ప్రశంసలు వెల్లువెత్తాయని, దాన్ని రద్దు చేయడమంటే మహాత్మా గాంధీని అవమానించడమేనని దుయ్యబట్టారు. ప్రధాని మంత్రివర్గాన్ని సంప్రదించకుండా, అధ్యయనం చేయకుండా ఏకపక్ష నిర్ణయం తీసుకున్నారని ధ్వజమెత్తారు. దేశంలో పాలన వన్ మ్యాన్ షోగా మారిపోయిందనడానికి ఇదే ఉదాహరణ అని స్పష్టం చేశారు. కేంద్ర ప్రభుత్వం తీసుకుంటున్న ఇటువంటి నియంతృత్వ చర్యలకు వ్యతిరేకంగా పోరాడేందుకు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ఉద్యోగాలు ఇవ్వకుండా యువత భవిష్యత్‌ను నాశనం చేసిన మోడీ ప్రభుత్వం, ఇప్పుడు గ్రామీణ ప్రజల ఉపాధిని దెబ్బతీస్తోందని మండిపడ్డారు. ఎన్నో ఏండ్లుగా ఆర్థిక భరోసానిస్తున్న పథకాన్ని ఆపితే ప్రజలు చూస్తూ ఊరుకోరని హెచ్చరించారు.

# డ్రగ్స్ కేసులో నిర్లక్ష్యం ఎందుకు?

మొదటి తరువాయి

అని రేవంత్‌రెడ్డి ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. అకున్ సబర్వాల్ ఆధ్వర్యంలో నాటి డ్రగ్స్ కేసు విచారణ ఏమైంది..? అని నిలదీశారు. అనేకమంది సెలబ్రిటీల పేర్లు బయటకు వచ్చాయి కదా..? ఏం చేశారని ప్రశ్నించారు. తమతోపాటు కేసీఆర్ కుటుంబ సభ్యులు కూడా డ్రగ్స్ తీసుకున్నారని.. గతంలో నిందితులు వాంగ్మూలం ఇచ్చారు కదా అని గుర్తుచేశారు. శనివారం హైదరాబాద్ లో మీడియాతో మాట్లాడారు బండి సంజయ్. నిందితుల వాంగ్మూలం ఆడియో, వీడియో రికార్డు చేశారని తెలిపారు. తమ కుటుంబ సభ్యుల భవిష్యత్ నాశనమవుతుందనే భయంతోనే.. గత కేసీఆర్ ప్రభుత్వ హయాంలో ఈ కేసు నీరుగార్చారని ఆరోపించారు. అకున్ సబర్వాల్‌ను డ్రగ్స్ కేసు నుంచి ఎందుకు తప్పించారని ప్రశ్నించారు. అకున్ సబర్వాల్ సేకరించిన ఆధారాలు, వీడియో స్టేట్‌మెంట్స్‌ను నాటి సీఎస్ సోమేశ్‌కుమార్ స్వాధీనం చేసుకున్నారని ప్రస్తావించారు. గతంలో సేకరించిన ఆధారాలు ఏమయ్యాయని నిలదీశారు. ఈ విషయంలో సోమేశ్‌కుమార్‌ను అదుపులోకి తీసుకుని ప్రశ్నించాలని అన్నారు. డ్రగ్స్ కేసులో ఈగల్ టీమ్ లీగల్‌గా విధులు నిర్వహిస్తోందా..? అని ప్రశ్నల వర్షం కురిపించారు. ఈగల్ టీమ్‌లో కొంతమంది డ్రగ్ పెడ్లర్లతో రాజీపడుతున్నారని ఆరోపణలు చేశారు. అకున్ సబర్వాల్‌కి తిరిగి డ్రగ్స్ కేసు బాధ్యతలు ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని బండి సంజయ్ కుమార్ డిమాండ్ చేశారు. నాటి డ్రగ్స్ కేసులో అనేక మంది బడా వ్యక్తులు, సినీ ప్రముఖులు ఉన్నారు. పట్టుబడిన వాళ్లను అకున్ సబర్వాల్ టీం నాడు విచారణ చేస్తే.. ఆ వాంగ్మూలంతో కూడిన ఆడియో, వీడియో రికార్డులు బయటకు రాకుండా అడ్డుకున్నారు. అదే సమయంలో ఆ కేసుపై అకున్ సబర్వాల్ టీం రూపొందించిన నివేదిక, రికార్డు చేసిన ఆడియో, వీడియో, స్టేట్ మెంట్లన్నింటినీ నాటి సీఎస్ సోమేశ్ కుమార్ స్వాధీనం చేసుకున్నారు. ఆ తరువాత డ్రగ్స్ కేసును పూర్తిగా నీరుగార్చారు. అకున్ సబర్వాల్ సేకరించిన ఆధారాలు, ఆడియో, వీడియో రికార్డులు, స్టేట్ మెంట్లను సోమేశ్ కుమార్ తదుపరి విచారణ టీమ్‌కు అప్పగించలేదు.. వాటిని కోర్టుకు స్వాధీనం చేయలేదు.

కాంగ్రెస్ ప్రభుత్వానికి నిజంగా డ్రగ్స్ నిర్మూలనపై చిత్తశుద్ధి ఉంటే సీఎం ఆధ్వర్యంలో పనిచేస్తున్న ఈగల్ టీమ్ వెంటనే రంగంలోకి దిగి సోమేశ్ కుమార్‌ను విచారించాలని అన్నారు. ఈగల్ టీమ్‌లో సమర్థులైన అధికారులు ఉన్నప్పటికీ, ఒకరిద్దరు మాత్రం డ్రగ్స్ పెడ్లర్లతో రాజీపడుతున్నారు. రాష్ట్రంలో విచ్చలవిడిగా పెరుగుతున్న డ్రగ్స్ విక్రయాలపై ఉక్కుపాదం మోపాలంటే.. అకున్ సబర్వాల్ వంటి సమర్థులైన అధికారులకు తిరిగి 'డ్రగ్స్ కేసు' విచారణ బాధ్యతలను అప్పగించాలని డిమాండ్ చేశారు.

## పింఛన్ పైసలతో ఢిల్లీకి మూటలు

మొదటి తరువాయి

సర్పంచ్‌లు 1500 మంది గెలిచారన్నారు. బీఆర్ఎస్ సర్పంచ్‌లకు నిధులు ఇవ్వబోమని ఎమ్మెల్యేలు బెదిరిస్తున్నారని.. కానీ రాజ్యాంగం, ఫైనాన్స్ కమిషన్ నిబంధన ప్రకారం కేంద్రం ఇచ్చే ప్రతి రూపాయికీ 85 పైసలు నేరుగా సర్పంచ్‌ల ఖాతాల్లో పడతాయని చెప్పారు. ఏ గొట్టంగాడూ నిధులు ఆపలేడని, సర్పంచ్‌లు మరింత స్ఫూర్తితో గ్రామాల అభివృద్ధికి పాటుపడాలని సూచించారు. 'సర్పంచ్ ఎన్నికలు క్వార్టర్ ఫైనల్ మాత్రమే.. ముందు మున్సిపల్, జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికలు సెమీఫైనల్.. 2028లో ఫైనల్ ఎన్నికలు ఉన్నాయి.. కేసీఆర్‌ను తిరిగి సీఎం చేయడమే లక్ష్యం" అని కేటీఆర్ అన్నారు. రేవంత్‌రెడ్డికి ఒకటే భాష వచ్చు అని తనకు నాలుగు భాషలు వచ్చు అని, తాను నాలుగు భాషల్లో తిట్టగలనని, కానీ.. తనకు సంస్కారం అడ్డొస్తుందని అన్నారు. కేసీఆర్ రైతులు అడగకుండా.. దరఖాస్తు చేయకుండా 11సార్లు రూ.73 వేల కోట్ల రైతుబంధు నిధులు జమ చేశారని గుర్తు చేశారు. కానీ కాంగ్రెస్ వచ్చాక రెండుసార్లు ఎగ్గొట్టారని విమర్శించారు. రేవంత్‌రెడ్డి ఎన్నికల సమయంలో కౌలు రైతులకు రైతుబంధు ఇస్తానని, అత్తకు రూ.4వేల పింఛన్, కోడలుకు రూ.2500 ఆత్మీయ భరోసా ఇస్తానని, కల్యాణ లక్ష్మిలో తులం బంగారం ఇస్తానని హామీ ఇచ్చారని గుర్తు చేశారు. కానీ, రేవంత్ తులం బంగారం ఇచ్చే టైపు కాదని, మెడలో ఉన్న పుస్తెలతాడు ఎత్తుకుపోయే టైపు అని విమర్శించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్రావు, ఎంపీ వద్దిరాజు రవిచంద్ర, మాజీ ఎమ్మెల్యేలు డిఎస్ రెడ్యా నాయక్, శంకర్ నాయక్, హరిప్రియ నాయక్, మాజీ మంత్రులు ఎర్రబెల్లి దయాకర్‌రావు సత్యవతి రాథోడ్, కెఎస్ఎన్.రెడ్డి, యాళ్ల మురళీధర్‌రెడ్డి పాల్గొన్నారు.

## 15 శాతం తగ్గిన నేరాలు

మొదటి తరువాయి

రానున్న రోజుల్లో నార్కొటిక్ టీమ్స్‌ను మరింత బలోపేతం చేస్తామని తెలిపారు. దేశంలోనే తెలంగాణ పోలీసులు నెంబర్‌వన్ స్థాయిలో ఉన్నారని, గతంతో పోలిస్తే నగరంలో లా అండ్ ఆర్డర్ బాగుందని, క్రైమ్‌రేట్ అదుపులో ఉందని తెలిపారు. నగర పోలీసులు ఎప్పుడూ ప్రజలకు అందుబాటులో ఉంటారని, ఏ ఆపద వచ్చినా డయల్ 100కు ఫోన్ చేయాలని కోరారు. అత్యాశకుపోయి నగరవాసులు సైబర్ నేరాలలో చిక్కుకుంటున్నారని, వాటిపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పిస్తున్నామని చెప్పారు. నగర వ్యాప్తంగా 5లక్షల 20 వేల సీసీ కెమెరాలను వినియోగిస్తున్నామన్నారు.

**మహిళలపట్ల పెరిగిన నేరాలు**
ఈ ఏడాది మహిళలపై (జరిగిన దాడులు, లైంగిక వేధింపులతోపాటు ఇతర నేరాలు) 6 శాతం నేరాలు పెరిగాయని సీపీ తెలిపారు. గతేడాది 2,482 వరకు కేసులు నమోదైతే, ఈ ఏడాది 2,625 కేసులు నమోదయ్యాయన్నారు. చిన్నారులపై సైతం (నేరాలు) దాడులు పెరిగాయన్నారు. ఈ క్రమంలో 7శాతం పోక్సో కేసులు అధికమయ్యాయన్నారు. చిన్నారులపై దాడులు, ఇతర నేరాలకు పాల్పడిన వారిపై 2024లో 449కేసులు నమోదైతే, ఈ ఏడాది 568కేసులు నమోదయ్యాయన్నారు. గతేడాది మహిళలపై లైంగికదాడి కేసులు 484 నమోదైతే ఈ ఏడాది 405 నమోదయ్యాయన్నారు.
వీటితోపాటు 7 శాతం దోపిడీలు పెరిగాయని తెలిపారు. కిడ్నాప్ కేసులు 2024లో 324 నమోదైతే, 2025లో 166కేసులు నమోదయ్యాయన్నారు.

## తెలుగు రాష్ట్రాల్లో పెరిగిన చలి

మొదటి తరువాయి

దూసుకొస్తున్నాయి. సూర్యాస్తమయం వరకు ఈ ప్రభావం ఉంటోంది. తర్వాత మళ్లీ బయట చలిపెరుగుతోంది. ఇళ్లలో వెచ్చగా ఉంటోంది. హెచ్‌సీయూ, పటాన్‌చెరు, గచ్చిబౌలి, రాజేంద్రనగర్ వంటి శివారు ప్రాంతాల్లో 6-8 డిగ్రీల మధ్య కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి.తెలంగాణలో జనవరి రెండో వారం నుంచి కనిష్ఠ ఉష్ణోగ్రతలు 13 డిగ్రీలు, ఆపైన నమోదవుతాయని వాతావరణ వివరాలు, ముందస్తు అంచనాలు అందించే 'స్కైమెట్ ' వెబ్‌సైట్ అంచనా వేసింది. మరో వాతావరణ వెబ్‌సైట్ ఆక్యువెదర్.. జనవరి తొలివారం తర్వాత చలి నుంచి ఉపశమనం ఉంటుందని, నెలాఖరుకల్లా కనిష్ఠ ఉష్ణోగ్రతలు 18-19 మధ్యకు చేరుతాయని పేర్కొంది. ఈనెల 31వరకు తీవ్రమైన చలి పరిస్థితులు కొనసాగుతాయని.. కనిష్ఠ ఉష్ణోగ్రతలు సాధారణం కంటే మరో 3-4 డిగ్రీలు తక్కువగా నమోదవుతాయని వాతావరణ నిపుణులంతా చెబుతున్నారు. సాధారణంగా 12 డిగ్రీలకుపైన ఉష్ణోగ్రతలు ఉన్నప్పుడు కాంక్రీటు గోడలు, శ్లాబులు ఆ చల్లదనానికి పెద్దగా ప్రభావితం కావు. అంతకన్నా ఎంత తగ్గుతూ పోతే.. అంతగా చల్లబడి, 'ప్రభావం అంతగా పెరుగుతుంది. రాత్రి ఉష్ణోగ్రతలు 8, 9 డిగ్రీలకు తగ్గిపోతే... గోడలు, శ్లాబు నుంచి తర్వాతి రోజంతా చల్లదనం వెలువడుతూనే ఉంటుంది. దానితో బయటికంటే ఇంట్లో చలి ఎక్కువగా ఉంటుంది. ఈ ఏడాది వానలు ఎక్కువగా కురవడం, ఉత్తర వాయవ్య దిశ నుంచి వీస్తున్న శీతల గాలులతో కనిష్ఠ ఉష్ణోగ్రతలు బాగా పడిపోయాయి. గత పదేళ్లలో అతి తక్కువ కనిష్ఠ ఉష్ణోగ్రతలు, ఎక్కువ రోజులు కొనసాగడం ఈసారే చూస్తున్నాం. మరో 10 రోజుల వరకు చలి తీవ్రత కొనసాగే అవకాశం ఉంది. సంక్రాంతి తర్వాత రాత్రిపూట ఉష్ణోగ్రతలు పెరుగుతాయి.

## దళితుల భూమిని దౌర్జన్యంగా లాక్కుంటారా

మొదటి తరువాయి

కాంగ్రెస్ ప్రభుత్వం, సీఎం రేవంత్‌రెడ్డిపై కల్వకుంట్ల కవిత సంచలన వ్యాఖ్యలు చేశారు. సీఎం రేవంత్‌రెడ్డిది డైవర్షన్, కరప్షన్ పాలన అని విమర్శలు చేశారు. శనివారం నాగర్ కర్నూలు జిల్లాలోజాగృతి జనం బాటలో భాగంగా పర్యటించారు. ఈ సందర్భంగా ప్రజలతో ముఖాముఖి నిర్వహించి వారి సమస్యలు తెలుసుకున్నారు. ప్రజల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేలా కృషి చేస్తానని ధైర్యం చెప్పారు. అనంతరం మీడియాతో మాట్లాడారు కవిత. అభివృద్ధి అవకాశాలు అందరికీ సమానంగా రావాలని సూచించారు. సామాజిక తెలంగాణ సాధనకు తాను కట్టుబడి ఉన్నానని స్పష్టం చేశారు. కేసీఆర్ హయాంలో కాళేశ్వరాన్ని పరుగులు పెట్టించినట్లుగా పాలమూరు - రంగారెడ్డి ప్రాజెక్టును ఎందుకు పట్టించుకోలేదని ప్రశ్నల వర్షం కురిపించారు. నల్ల మట్టి తీసేందుకు రైతుల వద్ద తీసుకున్న900 ఎకరాల భూమిని వారికి వెంటనే ఇవ్వాలని డిమాండ్ చేశారు. పదేళ్లలో డిండి ప్రాజెక్ట్‌కి నీటిని తరలించలేదని.. ప్రభుత్వం మారిన కూడా ఇంకా సర్వేలే జరుగుతున్నాయని కవిత విమర్శించారు.

# పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేసిన డిసిపి రామ్ రెడ్డి



**పెద్దపల్లి, డిసెంబర్ 27 (నీలగిరి ఎక్స్ ప్రెస్)**
పెద్దపల్లి పోలీస్ స్టేషన్‌ను డిసిపి రామ్ రెడ్డి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా స్టేషన్లోని రికార్డులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. పోలీసులకు పలు సూచనలు చేస్తూ, ప్రజల భద్రతకు కట్టుబడి ఉండాలని ఆదేశించారు.న్యూ ఇయర్ వేడుకలను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని జిల్లా ప్రజలకు విజ్ఞప్తి చేశారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. డీజే సౌండ్ పెట్టి ఇతరులకు ఇబ్బందులు కలిగించడం, రోడ్లపై అడ్డంకులు సృష్టించడం ఉపేక్షించబోమని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో సీఐ ప్రవీణ్ కుమార్, ఎస్సై లక్ష్మణరావు, రూరల్ ఎస్సై మల్లేష్‌తో పాటు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# విదేశీ పర్యటనలో అచ్చంపేట ఎమ్మెల్యే వంశీకృష్ణ



**అమ్రాబాద్, డిసెంబర్ 27 (నీలగిరి ఎక్స్ ప్రెస్)**
అచ్చంపేట ఎమ్మెల్యే, టీపీసీసీ ఉపాధ్యక్షులు డాక్టర్ వంశీకృష్ణ కుటుంబ సభ్యులతో కలిసి అమెరికా పర్యటనలో ఉన్నారు. పలు ప్రాంతాలను సందర్శిస్తూ, నూతన సంవత్సరం సందర్భంగా కుటుంబంతో సమయం గడుపుతున్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, నా కుటుంబ సభ్యులు అమెరికాలో ఉండడం వలన వారితో గడపాలని ఎప్పటి నుంచో అనుకుంటున్నాను. కానీ నియోజకవర్గ ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండడం వల్ల ఇప్పటివరకు అవకాశం రాలేదు. ఇప్పుడు వారం, పది రోజుల పాటు అమెరికాలో ఉంటాను. ఇది ఒక వెకేషన్ లాగా కుటుంబంతో గడపడానికి వచ్చిన ప్రయాణం, అని తెలిపారు.అచ్చంపేట ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానని, తన ఫోన్ సాధారణంగానే పనిచేస్తుందని, 24/7 అందుబాటులో ఉంటానని స్పష్టం చేశారు. నా మనసు ఎప్పుడూ అచ్చంపేటలోనే ఉంటుంది. పర్యటన ముగించుకొని త్వరలోనే మిమ్మల్ని కలుస్తాను, అని ఎమ్మెల్యే వంశీకృష్ణ ధన్యవాదాలు తెలిపారు.

# అల్ట్రాసౌండ్ కేంద్రాలపై వైద్య ఆరోగ్యశాఖ తనిఖీలు



**కరీంనగర్, డిసెంబర్ 27 (నీలగిరి ఎక్స్ ప్రెస్)**
జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ వెంకటరమణ, పిఓ ఎంహెచ్ఎన్ డాక్టర్ సన జవేరియా మరియు టీం సభ్యులు కలిసి కరీంనగర్ పట్టణంలోని పలు అల్ట్రాసౌండ్ మరియు ఫీటల్ మెడిసిన్ కేంద్రాలను తనిఖీ చేశారు.తనిఖీ సందర్భంగా రిజిస్టర్లు, పేషెంట్ అనుమతి పత్రాలు, కేస్ రికార్డులు, సంబంధిత డాక్యుమెంట్లు, ఫామ్ (ఎఫ్) పత్రాలను పరిశీలించారు. గర్భస్థపూర్వ మరియు గర్భస్థ పిండ లింగ నిర్ధారణ (లింగ ఎంపిక నిషేధ చట్టం) 1994, నిబంధనలు 1996 మార్గదర్శకాలను ఖచ్చితంగా పాటించాలని, ఉల్లంఘించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అదనంగా గైనకాలజిస్టులు, రేడియాలజిస్టులు, ఇతర నిపుణుల ఒరిజినల్ సర్టిఫికెట్లు, హాస్పిటల్ రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్లను కూడా వెరిఫై చేశారు. ఈ తనిఖీలు నిరంతరాయంగా కొనసాగుతాయని అధికారులు తెలిపారు.ఈ కార్యక్రమంలో డాక్టర్ సన జవేరియా, సయ్యద్ సాబీర్, రమేష్ పాల్గొన్నారు.

# కార్తవీర్యార్జున దీప పూజ



**కరీంనగర్, డిసెంబర్ 27 (నీలగిరి ఎక్స్ ప్రెస్)**
కరీంనగర్ పట్టణంలోని గాంధీ రోడ్ టిటిడి కళ్యాణ మండపంలో చలి చీకట్లు అలుముకున్న సమయంలో భక్తుల సమక్షంలో కార్తవీర్యార్జున దీప పూజ ఘనంగా నిర్వహించారు.పంచోపచార పూజలో దీపానికి ఉన్న విశిష్టతను ప్రతిబింబిస్తూ, 1008 దీపాలతో కార్తవీర్యార్జున దీప యంత్ర నిర్మాణం చేసి ప్రత్యేక పూజా విధానం చేపట్టారు. మంత్రమహోదధి ప్రకారం ఈ దీప తంత్రం గత పది సంవత్సరాలుగా శ్రీ బగళ ప్రత్యంగిరా అనుగ్రహ పీఠం ఆధ్వర్యంలో గురువులు బ్రహ్మశ్రీ శశికాంత్ శర్మ, సత్యానంద నాథ దీక్షానామాంకితుల మార్గదర్శకత్వంలో కొనసాగుతోంది.గణపతి విఘ్నాలను తొలగించడం, సరస్వతి విద్యను ప్రసాదించడం, కాళీ శక్తిని అనుగ్రహించడం, సహస్రబాహువులు కలిగిన సుదర్శనుని అవతారంగా ప్రకాశించే కార్తవీర్యార్జునుని పూజ ద్వారా భక్తులు కోల్పోయిన ధనం, భాగస్వామ్యం, ఉద్యోగం తిరిగి పొందగలరని విశ్వాసం ఉంది. గురు అక్రుప వల్ల దూరమైన వారు కూడా ఈ దీప తంత్రం ద్వారా గురువు కృపను తిరిగి పొందగలరని నిర్వాహకులు తెలిపారు.అన్ని రకాల బాధలను తొలగించే అద్భుతమైన ప్రక్రియగా భావించే ఈ పూజలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని దత్తాత్రేయుని, కార్తవీర్యార్జునుని అనుగ్రహం పొందారు.

# అభివృద్ధి పనులకు శంకుస్థాపన



**గంగాధర, డిసెంబర్ 27 (నీలగిరి ఎక్స్ ప్రెస్)**
కరీంనగర్ జిల్లా రామడుగు మండలంలోని కొరటపెల్లి గ్రామంలో పలు అభివృద్ధి పనులకు స్థానిక సర్పంచ్ మేకల మహేశ్వరి ప్రభాకర్ యాదవ్ శంకుస్థాపన చేశారు.గ్రామ ప్రభుత్వ పాఠశాల ప్రహరీ గోడ నిర్మాణానికి ₹10 లక్షలు, వంటగది షెడ్‌కు ₹4 లక్షలు, టాయిలెట్స్ నిర్మాణానికి ₹2 లక్షలు మొత్తం ₹16 లక్షల రూపాయల నిధులను కేంద్ర హోం శాఖ మంత్రి బండి సంజయ్ కుమార్ మంజూరు చేశారు.సర్పంచ్ బాధ్యతలు స్వీకరించిన కొద్ది కాలంలోనే ఈ నిధులు మంజూరు కావడం పట్ల గ్రామస్థులు ఆనందం వ్యక్తం చేశారు. కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్, జిల్లా కలెక్టర్‌కు గ్రామ సర్పంచ్ మేకల మహేశ్వరి ప్రభాకర్ యాదవ్ మరియు గ్రామ ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో గ్రామ ఉప సర్పంచ్ మన్నే విక్రమ్, గ్రామ కార్యదర్శి శ్రీనివాస్, సుధీర్ కుమార్, దాసరి మానస రవితేజ, కలిగేటి శ్రీకాంత్, మేకల మమత మనోహర్, మేకల అభిషేక్, గాదె భూమయ్య, నెల్లి నీలమ్మ శంకర్‌తో పాటు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# ఆశ వర్కర్స్ ధర్నా లెప్రసి బిల్లులపై ఆందోళన




**కరీంనగర్, డిసెంబర్ 27 (నీలగిరి ఎక్స్ ప్రెస్)**
జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట ఆశ వర్కర్స్ 202223 లెప్రసి బిల్లులు, పల్స్ పోలియో బిల్లులు, ఎన్నికల రెమ్యూనరేషన్ చెల్లించాలని డిమాండ్ చేస్తూ ధర్నా చేపట్టారు. ఈ కార్యక్రమం తెలంగాణ ఆశ వర్కర్స్ యూనియన్ (సి ఐ టి యు) ఆధ్వర్యంలో జరిగింది.జిల్లా ఉపాధ్యక్షులు ఎడ్ల రమేష్ మాట్లాడుతూ, అప్పటి డీఎంహెచ్ఓ ఆశ వర్కర్స్ బిల్లులను ఎటు మళ్లించారో సమగ్ర విచారణ జరిపి, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరారు. 2024 బిల్లులు పోరాటం ద్వారా సాధించుకున్నామని, ఇకపై కొత్త పనులు చేయడం బంద్ చేసి, రాష్ట్ర ప్రభుత్వం హామీ ఇచ్చిన రూ.18,000 వేతనం, పీఎఫ్, ఈఎస్ఐ, ఇన్సూరెన్స్ వంటి హక్కుల కోసం తిరుగుబాటు చేస్తామని తెలిపారు.జిల్లా ప్రధాన కార్యదర్శి మారెళ్ళ శ్రీలత మాట్లాడుతూ, పెండింగ్ బిల్లులు ఒక్కో ఆశ వర్కర్‌కు రూ.3,000 వరకు రావాలని, కానీ ఇవ్వకుండా పని ఒత్తిడి పెంచుతున్నారని విమర్శించారు. ఆశ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో అనేక పోరాటాల వల్లే పారితోషికాలు పెరిగాయని, ఇప్పుడు బిల్లులు చెల్లించే వరకు పోరాటం ఆగదని స్పష్టం చేశారు. ఈ ధర్నాలో జిల్లా అధ్యక్షులు కాల్వ సారిక, ఉపాధ్యక్షులు పద్మ, లత, శ్యామల, సరిత, సహాయ కార్యదర్శి సుమ, శ్యామల, ప్రియాంక, రజితతో పాటు పలువురు ఆశ వర్కర్స్ పాల్గొన్నారు.

# నేడు పెద్దపల్లి జిల్లా స్థాయి ఓపెన్ చదరంగ పోటీలు



**ఎలిగేడు, డిసెంబర్ 27 (నీలగిరి ఎక్స్ ప్రెస్)**
పెద్దపల్లి జిల్లా చదరంగ సమైక్య ఆధ్వర్యంలో జిల్లా స్థాయి చదరంగ పోటీలు నేడు ఘనంగా ప్రారంభమవుతున్నాయి. పెద్దపల్లిలోని క్రీసెంట్ హై స్కూల్, సుభాష్ నగర్‌లో ఈ పోటీలు జరుగనున్నాయి.జిల్లా చదరంగ సమైక్య అధ్యక్షులు గడ్డాల శ్రీనివాస్ తెలిపారు ?? ఈ పోటీలు తూముల సుభాష్ రావు ఆధ్వర్యంలో, ఆయన తల్లిదండ్రులు కీర్తిశేషులు తూముల అమృతమ్మ నారాయణ జ్ఞాపకార్థం నిర్వహించబడుతున్నాయి.ఉదయం 9 గంటలకు పోటీలు ప్రారంభమవుతాయి. పాల్గొనే క్రీడాకారులు 150 రూపాయల ఎంట్రీ ఫీజుతో పాటు తమ చెస్ బోర్డులు, పావులు వెంట తీసుకురావాలి. గెలుపొందిన క్రీడాకారులకు మొదటి 8 స్థానాలకు నగదు బహుమతులు అందజేయబడతాయి. అదనంగా అండర్ 9, అండర్ 11, అండర్ 15 విభాగాల్లో ప్రత్యేక బహుమతులు కూడా ఇవ్వబడతాయి. పాల్గొన్న వారందరికీ భోజన వసతి కల్పించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

# రిపబ్లిక్ డే క్యాంపుకు ఎంపికైన ఎన్‌సిసి కేడెట్ అభిరామ్



**ఎలిగేడు, డిసెంబర్ 27(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
ఎలిగేడు మండలంలోని సుల్తానాపూర్ గ్రామానికి చెందిన అక్కినపల్లి నాగరాజు శివజ్యోతి ల కుమారుడు అక్కినపల్లి అభిరామ్, జనవరి 2026లో న్యూఢిల్లీలో జరగనున్న ప్రతిష్టాత్మక రిపబ్లిక్ డే క్యాంపు కి ఎంపికయ్యాడు.ఈ సందర్భంగా ప్రధానమంత్రి నరేంద్ర మోడీ సమక్షంలో దేశవ్యాప్తంగా ఎంపికైన కేడెట్లు తమ క్రమశిక్షణ, ఐక్యత, దేశభక్తిను ప్రదర్శించనున్నారు.అభిరామ్ ఎంపిక ఆయన యొక్క అంకితభావం, క్రమశిక్షణ, కఠిన శ్రమకు నిదర్శనమని గ్రామస్థులు పేర్కొన్నారు. కుటుంబ సభ్యులు, గ్రామ ప్రజలు అభిరామ్‌కు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు.

# నేడు అంతర్జాతీయ వికలాంగుల దినోత్సవం ముగింపు మహోత్సవం




**బోడుప్పల్, డిసెంబర్ 27(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
బోడుప్పల్ ఎస్ఎస్ఎస్ గార్డెన్స్‌లో నేడు ఉదయం తొమ్మిది గంటలకు అంతర్జాతీయ వికలాంగుల దినోత్సవం ముగింపు మహోత్సవం ఘనంగా జరగనుంది. శ్రీలక్ష్మి ప్రసన్న ట్రస్ట్ చైర్మన్ తమ్మాన్ ఆధ్వర్యంలో, బోడుప్పల్ వికలాంగుల సంక్షేమ సంఘం సహకారంతో ఈ వేడుకలు ప్రత్యేకంగా నిర్వహించబడుతున్నాయి.ఈ సందర్భంగా నిరుపేద దివ్యాంగులకు దుప్పట్లు, విల్‌చేర్స్, చంకకర్రలు పంపిణీ చేయబడతాయి. వివిధ రంగాలలో ప్రతిభ కనబర్చిన దివ్యాంగులకు ఉత్తమ ప్రతిభ అవార్డులు ప్రదానం చేయబడతాయి. అదేవిధంగా ఆదర్శ దివ్యాంగుల జంటలకు సన్మాన కార్యక్రమం కూడా నిర్వహించబడుతుంది.దివ్యాంగులందరూ ఈ అవకాశాన్ని సాధ్వినియోగం చేసుకోవాలని ట్రస్ట్ చైర్మన్ తమ్మాన్ కోరారు.ఈ మహోత్సవానికి ముఖ్య అతిథులుగా ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న, మేడ్చల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు తోటకూర వజ్రేష్ యాదవ్, స్థానిక కార్పొరేటర్లు, ప్రజాప్రతినిధులు, రాష్ట్ర జిల్లా దివ్యాంగుల నాయకులు, ఎన్జీఓ ప్రతినిధులు విచ్చేసి పాల్గొననున్నారు.

# అంగన్వాడీ కేంద్రానికి అక్షరాల బోర్డు అందజేత





**కల్వకుర్తి, డిసెంబర్ 27(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
కల్వకుర్తి పట్టణానికి చెందిన స్వామి వివేకానంద సేవా బృందం ఆధ్వర్యంలో స్థానిక గాంధీనగర్ అంగన్వాడీ కేంద్రానికి తెలుగు వర్ణమాల, అంకెలు, ఆంగ్ల అక్షరాలతో కూడిన బోర్డు అందజేయబడింది.కార్యక్రమంలో జాతీయ యువజన అవార్డు గ్రహీత శివ కుమార్ మాట్లాడుతూ నిరుపేద పిల్లలకు జీవితంలో మొదటి విద్య అంగన్వాడీ కేంద్రాల నుంచే ప్రారంభమవుతుందని, అందువల్ల చిన్నారులకు సరైన విద్య అందుబాటులో ఉండేలా ఈ అక్షరాల బ్యానర్ బోర్డు అందజేశామని తెలిపారు. రానున్న రోజుల్లో సేవా కార్యక్రమాలను మరింత విస్తృతం చేయనున్నామని ఆయన పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో సేవా బృందం సభ్యులు లక్ష్మి నరసింహ, రోహిత్ శర్మ, గణేష్, అంగన్వాడీ టీచర్ ఫాతిమా, వైద్య సిబ్బంది వరలక్ష్మి, భాగ్యలక్ష్మి, శారా, బాలింతలు, చిన్నారులు పాల్గొన్నారు.

# పేదల సంక్షేమమే పభుత్వంలక్ష్యం

- సేవాలాల్ సేన రాష్ట్ర కార్యదర్శి, ఉప సర్పంచి జర్పుల లక్పతి నాయక్



**కడ్తాల్, డిసెంబర్ 27 ( నీలగిరి ఎక్స్ ప్రెస్ )**
పేదల సంక్షేమమే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తుందని సేవాలాల్ సేన రాష్ట్ర కార్యదర్శి, ఉప సర్పంచి జర్పుల లక్పతి నాయక్ అన్నారు. శనివారం రంగారెడ్డి జిల్లా కడ్తాల్ మండలం గానుగమర్ల తండా గ్రామ పంచాయితీలో నూతనంగా నిర్మాణం చేపట్టిన ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాల పనులను లక్పతి నాయక్ పరిశీలించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి, ఎంపీ మల్లురవి, ఏఐసిసి కార్యదర్శి చల్లా వంశీచంద్ రెడ్డి సహకారంతో ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేశారని గుర్తు చేశారు. లబ్దిదారులు ఇందిరమ్మ ఇండ్లను సహకాలంలో పూర్తి చేయాలని సూచించారు. రాష్టంలో పేదలందరికి ఇందిరమ్మ ఇండ్లను నిర్మించాలన్న సంఖల్పంతో ప్రభుత్వం కృషి చేస్తుందని అన్నారు. గత బిఆర్ ఎస్ ప్రభుత్వం పేదలను పట్టించుకోలేదని విమర్శించారు. గానుగమర్లతండాకు మరిన్ని ఇందిరమ్మ ఇండ్లను మంజూరు కోసం ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్తానని లక్పతి నాయక్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి రఘు, పాండు నాయక్, లబ్దిదారులు పాల్గొన్నారు.

## పాఠశాలను సందర్శించిన స్కూల్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు



**రామడుగు, డిసెంబర్ 27 (నీలగిరి ఎక్స్ ప్రెస్)**
కరీంనగర్ జిల్లా చొప్పదండి నియోజకవర్గంలోని పాఠశాలల ఆకస్మిక తనిఖీలలో భాగంగా గోపాలరావుపేట స్కూల్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు కాడే చంద్రశేఖర్ ప్రాథమికోన్నత పాఠశాల వెంకట్రావుపల్లిని సందర్శించారు.ఈ సందర్భంగా ఉపాధ్యాయుల పనితీరు, మోడల్ లెసన్, డెమో క్లాసులు, విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలించారు. ఎఫ్ఎల్ఎస్ పై మూడవ తరగతి విద్యార్థులకు మాక్ టెస్టులు నిర్వహించాలని సూచించారు.అదనంగా పాఠశాల పరిసరాలు, మధ్యాహ్న భోజన నిర్వహణ, కిచెన్ గార్డెన్‌ను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో స్కూల్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు, వెంకట్రావుపల్లి పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు జ్యోతిర్మయి, ఉపాధ్యాయులు రవీందర్, ఆంజనేయులు పాల్గొన్నారు.

# లయన్స్ క్లబ్ సేవలు విస్తృతం చేస్తాం

-అధ్యక్షుడు కె. గోవర్ధన్ రెడ్డి



**ఆమనగల్లు, డిసెంబర్ 27(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
ఆమనగల్లు పట్టణంలోని కళ్యాణి గార్డెన్స్‌లో లయన్స్ క్లబ్ ఆఫ్ ఆమనగల్లు ఆధ్వర్యంలో సమావేశం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి క్లబ్ మాజీ గవర్నర్ జి. చెన్న కిషన్ రెడ్డి, జూలూరి రమేష్ బాబు, రామ్ రెడ్డి, లయన్ హాస్పిటల్ చైర్మన్ డాక్టర్ వి. దామోదర్ రెడ్డి, రీజియన్ చైర్మన్ సంపత్, జనార్దన్ రెడ్డి, జోన్ చైర్మన్ జూలూరి లింగయ్య ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.క్లబ్ అధ్యక్షుడు కె. గోవర్ధన్ రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ సభ్యుల సహకారంతో లయన్స్ క్లబ్ సేవలను మరింత విస్తృతం చేస్తామని తెలిపారు. క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉచిత కంటి ఆరోగ్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని, ఆకలితో అలమటిస్తున్న వారికి మిల్స్ అండ్ విల్స్ ద్వారా ఆహారం అందిస్తున్నామని వివరించారు. పేద ప్రజలకు అండగా లయన్స్ క్లబ్ సేవలు అందేలా కృషి చేస్తామని ఆయన స్పష్టం చేశారు.సేవా కార్యక్రమాలకు సూచనలు, సలహాలు అందిస్తున్న సభ్యులందరికీ ఆయన అభినందనలు తెలిపారు. రాజకీయ రంగంలో విజయాలు సాధించిన సభ్యులను కూడా ఈ సందర్భంగా ఘనంగా సత్కరించారు. తలకొండపల్లి మండల పరిధిలోని పడకల్ గ్రామానికి సర్పంచ్‌గా ఎన్నికైన డోకూరు ప్రభాకర్ రెడ్డి, లింగరావుపల్లి గ్రామ సర్పంచ్‌గా ఎన్నికైన కాసు శ్రీనివాస్ రెడ్డి, కడ్తాల గ్రామ వార్డు సభ్యుడిగా ఎన్నికైన ముత్తు కృష్ణ, వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ ప్రధాన కార్యదర్శిగా ఎన్నికైన మాజీ గవర్నర్ జూలూరి రమేష్ బాబు లను లయన్స్ క్లబ్ ఆమనగల్లు సత్కరించింది.ఈ కార్యక్రమంలో జిల్లా చైర్మన్ మిట్టపల్లి అంజయ్య, సునంద, కండె సత్యం,ఓంకారం, ఎం. చంద్రశేఖర్, ఉపాధ్యక్షులు ఎంగలి బాలకృష్ణ, కార్యదర్శి గంప శ్రీనివాస్, కోశాధికారి శ్రీనివాసరెడ్డి, మాజీ అధ్యక్షులు పసుల లక్ష్మారెడ్డి, యాదయ్య గుప్తా, వెంకటరెడ్డి, బైరి కరుణాకర్ రెడ్డి, జంగారెడ్డి, నరేందర్ రెడ్డి, కటిక శ్రీనివాస్ రెడ్డి, కర్నాటి కొండారెడ్డి, పాండు రెడ్డి, జహంగీర్ అలీ, చేకూరి వెంకటేష్, నేతి వినోద్, జల్కం రమేష్, బందే రాజేందర్, సంపత్, అల్లాజి గౌడ్, కొరివి వెంకటయ్య, మధుసూదన్ రెడ్డి, డాక్టర్ మహేశ్వరరెడ్డి, డాక్టర్ కృష్ణ, క్లబ్ పిఆర్ఓ పాషా తదితరులు పాల్గొన్నారు.

# వైభవంగా పత్రీజీ ధ్యాన మహాయాగం





-పెద్ద సంఖ్యలో పాల్గొన్న ద్యానులు
-వివిధ పిరమిడ్ల ఏవీల ప్రదర్శన






**కడ్తాల్, డిసెంబర్ 27 ( నీలగిరి ఎక్స్ ప్రెస్)**
కడ్తాల్ మహేశ్వర మహా పిరమిడ్ లో ధ్యాన ఉత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. శనివారంతో ఎడో రోజుకు చేరుకున్నాయి. ధ్యాన ఉత్సవాల్లో భాగంగా తూర్పు గోదావరి జిల్లా పేరవరంలో గల శ్రీ వశిష్ట గౌతమి మహాపిరమిడ్ ధ్యాన శక్తి క్షేత్రం ఏవీని ప్రదర్శించారు. అనంతరం మాట్లాడిన ట్రస్ట్ సభ్యులు గత నవంబర్ 11న బ్రహ్మర్షి పత్రీజీ జన్మదినం రోజు శ్రీ వశిష్ట గౌతమి మహాపిరమిడ్ ధ్యాన శక్తి క్షేత్రం మొదటి వార్షికోత్సవం జరుపుకున్నామని తెలిపారు.వచ్చే ఏడాది మార్చి 13 నుంచి 19 వరకు నిర్వహించే ఉగాది ఉత్సవాలకు ప్రతి ఒక్కరూ రావాలని ఆహ్వానించారు.కర్నాటక రాష్ట్రం, చిత్రదుర్గ జిల్లా,ఆదివల్ గ్రామంలో గల మహామైత్రేయ పత్రీజీ పిరమిడ్ గురించి ట్రస్ట్ సభ్యులు వివరించారు. మహామైత్రేయ పత్రీజీ పిరమిడ్ కర్నాటక రాష్ట్రంలో రెండవ అతిపెద్ద మెగా పిరమిడ్ అని తెలిపారు.లైట్ వర్కర్స్ టీం గురించి నిర్వాహకులు రంజిత్ కుమార్ వివరించారు.బ్రహ్మర్షి పత్రీజీ ఆశయ సాధనలో భాగంగా అందరికీ ధ్యానాన్ని అందించాలన్న ఉద్దేశంతో లైట్ వర్కర్స్ టీవీని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. విజయవాడ సమీపాన గల మానససరోవరం సిద్ధార్థ పిరమిడ్ గురించి మానససరోవర ధ్యాన ఆశ్రమ వ్యవస్థాపకులు కళ్లం రామిరెడ్డి తెలిపారు.వచ్చే ఏడాది జనవరి 11 వ తేదిన మానససరోవరం 13వ వార్షికోత్సవ వేడుకలు నిర్వహిస్తున్నామని,ఈ కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ పాల్గొనాలని ఆహ్వానించారు.ఖమ్మం జిల్లా పిండిప్రోలు గ్రామంలో గల కాస్మిక్ వ్యాలీ గురించి కాస్మిక్ వ్యాలీ ట్రస్ట్ వైస్ చైర్మన్ రఘురాంప్రసాద్,కాస్మిక్ వ్యాలీ ఇంటర్నేషనల్ అసోసియేట్ మెంబర్ శ్రీకాంతి లు వివరించారు.

**జ్ఞానమే అన్నింటికన్నా గొప్పది**
– బ్రహ్మర్షి తటవర్తి వీరరాఘవరావు

ధ్యానం వల్లనే జ్ఞానం వస్తుందని ,ధ్యానం వల్లనే కర్మరహితం అవుతుందని,కర్మ రహితం వల్లనే మోక్షం లభిస్తుందని బ్రహ్మర్షి పత్రీజీ చెప్పేవారని బ్రహ్మర్షి తటవర్తి వీరరాఘవరావు తెలిపారు.జ్ఞానంతోనే కర్మలు దగ్ధం అవుతాయని,జ్ఞానం పొందినప్పుడే అజ్ఞానం తొలిగిపోతోందన్నారు.ఆత్మకు మించింది లేదని, అన్నింటికంటే ఆత్మే గొప్పదని,ఆత్మేసత్యమని చెప్పారు. ప్రతి ధ్యాని మాస్టర్ గా ఎదగాలని బ్రహ్మర్షి పత్రీజీ ఆకాంక్షించేవారని,ఎంత ఎక్కువ జ్ఞానం ఉంటే అంత గొప్ప మాస్టర్ గా ఎదుగుతారని తెలిపారు.భీమవరంలో ప్రతి నెల 1,2,3 తేదిల్లో జరిగే ఆత్మజ్ఞాన శిక్షణ శిబిరంలో ప్రతి ఒక్కరూ పాల్గొనాలని ఆహ్వానించారు.జ్ఞానం పెంచుకునేందుకు ప్రతి ఒక్కరూ సరైన ధ్యానం చేయాలని,ఆత్మజ్ఞానానికి సంబంధించిన పుస్తకాలను చదవాలని,ఆత్మజ్ఞానం బోధించే వారి సందేశాలు వినాలని,ధ్యానం మార్గంలో సేవ చేయాలని సూచించారు. అనంతరం ది పిరమిడ్ స్పిరుచ్యువల్ ట్రస్ట్ హైదరాబాద్ చైర్మన్ విజయభాస్కర్ రెడ్డి,ధ్యాన సప్తాహం ప్రాజెక్టు చైర్మన్ సంగీతబాబు, బ్రహ్మర్షి తటవర్తి వీరరాఘవరావును ఘనంగా సన్మానించారు.ప్రతీజీ ధ్యాన మహాయాగంలో బ్రేక్ ది రొటీన్ అనే అంశం గురించి బ్రహ్మర్షి పత్రీజీ వీడియా సందేశం ధ్యానులను ఆకట్టుకుంది.ఎప్పుడు ఒకే మూసలో చేసే పనిని బ్రేక్ చేయాలన్నారు.అప్పుడు ఆత్మపురోగతి బాగా ఉంటుందని తెలిపారు.ఎప్పుడూ చేసిందే చేయకూడదని,చేయనిది చేయాలని సూచించారు.ప్రతి రోజు చేసే ఆహారం కాకుండా ఒక రోజు ఉపావాసం ఉండి రొటీన్ ను బ్రేక్ చేయాలన్నారు.అలాగే రోజు వెళ్లే దారిలో ఆఫీస్ కు వెళ్లకుండా కొత్త దారిలో వెళ్లాలని సూచించారు.ప్రతి రోజు ధ్యానం చేస్తే ఒక రోజు ధ్యానం చేయకుండా ఉండాలని అప్పుడే దాని విలువ తెలుస్తుందని చెప్పారు. ప్రతి రోజు ఒకే మూసలో వెళ్లకుండా కొత్తగా చేయాలని తెలిపారు.తాను ఏడాది పాటు మౌనంగా ఉండి రొటీన్ ను బ్రేక్ చేసానని తెలిపారు.ప్రతి రోజు చేసే పనే చేయకుండా వేరే విధంగా చేయాలన్నారు.బ్రేక్ ద రొటీన్ నే వ్రత మహిమా అంటారని తెలిపారు.

**పుస్తకావిష్కరణ కార్యక్రమం..**
2026 జనవరి ధ్యాన జగత్ మ్యాగజైన్ ను బ్రహ్మర్షి పత్రీజీ కూతురు పరిణిత పత్రీ ఆవిష్కరించారు.ఈ మ్యాగజైన్ గురించి ధ్యాన జగత్ మాసపత్రిక పబ్లిషర్ కేశవరాజు వివరించారు.అనంతరం దైనందన గీత అనందప్రదాత అనే పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ది పిరమిడ్ స్పిరుచ్యువల్ ట్రస్ట్ హైదరాబాద్ చైర్మన్ విజయభాస్కర్ రెడ్డి, ధ్యాన సప్తాహం ప్రాజెక్ట చైర్మన్ సంగీతబాబు, తిరుపతి జిల్లా అధ్యక్షుల కంచిరఘురాం తదితరులు పాల్గొన్నారు.

# పెద్దపల్లిలో జీవో 252 వ్యతిరేకంగా జర్నలిస్టుల ఆందోళన





**పెద్దపల్లి, డిసెంబర్ 27 (నీలగిరి ఎక్స్ ప్రెస్):** జర్నలిస్టుల హక్కులను కాలరాసే విధంగా ప్రభుత్వం తీసుకొచ్చిన జీవో 252ను వెంటనే సవరించాలని పెద్దపల్లి జిల్లా టియుడబ్ల్యూజే హెచ్-143 జర్నలిస్టులు డిమాండ్ చేశారు. కలెక్టరేట్ కార్యాలయం ముందు ఆందోళన చేపట్టి, అనంతరం అదనపు కలెక్టర్ వేణుకు వినతిపత్రం అందజేశారు. జర్నలిస్టులు మాట్లాడుతూ గత ప్రభుత్వ కాలంలో 23 వేల అక్రిడిటేషన్ కార్డులు ఇచ్చినప్పటికీ, కొత్త జీవోతో 10 వేలకుపైగా కార్డులకు కోత పడే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. నియోజకవర్గ స్థాయిలో రిపోర్టర్లకు ఇచ్చే కార్డులను రద్దు చేసి, రాష్ట్ర, జిల్లా, మండల స్థాయిలో మాత్రమే కార్డులు ఇవ్వడం దారుణమని పేర్కొన్నారు. జనరల్, స్పోర్ట్స్, కల్చరల్, ఫిల్మ్, కార్టూనిస్టులకు ప్రత్యేక కోటాను రద్దు చేసి, ఫ్రీలాన్స్ కోటాలో కేవలం కార్టూనిస్టులకు మాత్రమే పరిమితం చేయడం అన్యాయమని అన్నారు. రాష్ట్రస్థాయి అక్రిడిటేషన్‌కు డిగ్రీ లేదా ఐదేళ్ల అనుభవం, జిల్లామండల స్థాయిలో ఇంటర్మీడియట్ విద్యార్హత తప్పనిసరి చేయడం, కానీ అనుభవాన్ని పరిగణనలోకి తీసుకోకపోవడం సరికాదని విమర్శించారు. మండలానికి ఒక కార్డు మాత్రమే ఇవ్వడం, కేబుల్ చానళ్లకు జిల్లా స్థాయి కార్డులను రద్దు చేయడం చిన్న పత్రికలను చిదిమే చర్యగా అభివర్ణించారు. విజిటింగ్ కార్డులు, లెటర్‌హెడ్స్‌పై అనే పదాలను వాడరాదని పేర్కొనడం కూడా వ్యతిరేకించారు. ఏ రాష్ట్రంలో లేని విధంగా తెలంగాణలో కఠినమైన నిబంధనలతో అక్రిడిటేషన్ రూల్స్ రూపొందించడం చిన్న పత్రికలపై కక్షసాధింపు ధోరణిగా ఉందని జర్నలిస్టులు ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం పునరాలోచన చేసి జీవో 252ను సవరించాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో టియుడబ్ల్యూజే హెచ్-143 టెంజూ జిల్లా అధ్యక్షుడు కొట్టె సధానందం, నేషనల్ కౌన్సిల్ మెంబర్ అంకరి ప్రకాష్, ప్రధాన కార్యదర్శి ముద్దసాని సమ్మయ్య, ఉపాధ్యక్షుడు కాల్వ రమేష్, తిర్రీ తిరుపతి గౌడ్, కీర్తి రమేష్, దొమ్మటి రాజేష్, ఎన్డీ తివారి, అర్కుటి మల్లేష్ యాదవ్, చిలపు కిషన్, కొయ్యడ తిరుపతి, తూర్పాటి శ్రీనివాస్, దుర్గం లక్ష్మణ్, తిర్రి సుధాకర్ గౌడ్, మార్వాక అంజి, డీఎల్ఎన్ చారీతో పాటు పలువురు జర్నలిస్టులు పాల్గొన్నారు.

## నూతన సర్పంచుల సన్మాన కార్యక్రమం



**కరీంనగర్, డిసెంబర్ 27 (నీలగిరి ఎక్స్ ప్రెస్)** కరీంనగర్ ఇందిరా గార్డెన్స్‌లో నూతన సర్పంచుల సన్మాన కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ సమావేశానికి మంత్రి పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్యేలు మేడిపల్లి సత్యం, ఆది శ్రీనివాస్, డా. కవ్వంపల్లి సత్యనారాయణ, మాజీ మంత్రి జీవన్ రెడ్డి, ఎమ్మెల్సీ బలమురి వెంకట్‌తో పాటు పలువురు కాంగ్రెస్ నేతలు హాజరయ్యారు. మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ సర్పంచులకు ప్రభుత్వం అండగా ఉంటుందని, గ్రామాల్లో మౌలిక సదుపాయాలు, విద్య, శానిటేషన్, తాగునీటి సమస్యల పరిష్కారంపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని సూచించారు. మేడిపల్లి సత్యం మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధి దేశ అభివృద్ధికి పునాది అని, పార్టీలకు అతీతంగా ప్రజలతో కలిసిమెలిసి పనిచేయాలని సర్పంచులను కోరారు. జీవన్ రెడ్డి మాట్లాడుతూ సర్పంచుల బాధ్యత అత్యంత కీలకమని, సంక్షేమ పథకాల అమలు వారిపై ఆధారపడి ఉంటుందని అన్నారు. ఆది శ్రీనివాస్ పంచాయతీ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు 65% ప్రజా మద్దతు లభించిందని, బీఆర్ఎస్ తప్పుడు ఆరోపణలను తిప్పికొట్టాలని సూచించారు. కవ్వంపల్లి సత్యనారాయణ గ్రామాల్లో పారిశుధ్యం, వీధి దీపాలు, డ్రైనేజీ వ్యవస్థ మెరుగుపరచడంపై సర్పంచులు శ్రద్ధ పెట్టాలని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నేతలు, ప్రజాప్రతినిధులు, సర్పంచులు పాల్గొన్నారు.

## రాష్ట్రస్థాయి సబ్ జూనియర్ సాఫ్ట్ బాల్ పోటీలకు రైజింగ్ సన్ విద్యార్థి ఎంపిక




**పెద్దపల్లి, డిసెంబర్ 27 (నీలగిరి ఎక్స్ ప్రెస్)** పెద్దపల్లి జిల్లా గోదావరిఖని ప్రభుత్వ డిగ్రీ, పీజీ కళాశాల మైదానంలో జిల్లా సాఫ్ట్ బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన సబ్ జూనియర్ పోటీల్లో ప్రతిభ కనబరిచిన రైజింగ్ సన్ పాఠశాల విద్యార్థి ఫైజాన్ రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. ఈనెల 27 నుంచి 29 వరకు మెదక్ జిల్లా మనోహరాబాద్‌లో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో అతను పాల్గొననున్నట్లు వ్యాయామ ఉపాధ్యాయుడు తగురం తిరుపతి తెలిపారు. ఈ సందర్భంగా పాఠశాల కరెస్పాండెంట్ సయీద్ అహ్మద్, ప్రధానోపాధ్యాయుడు హకీమ్ ఖాన్ విద్యార్థిని అభినందించారు.

## కోతుల సమస్యపై టీచర్స్ కాలనీ వాసుల వినతి



**హుస్నాబాద్, డిసెంబర్ 27 (నీలగిరి ఎక్స్ ప్రెస్):** హుస్నాబాద్ పట్టణంలోని టీచర్స్ కాలనీ వాసులు కోతుల సమస్యతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని మున్సిపల్ కార్యాలయం సానిటరీ ఇన్స్పెక్టర్ బాలు ఎల్లంకు వినతిపత్రం అందజేశారు. వందల కొద్దీ కోతులు రాత్రింబగళ్లు రోడ్లపై తిరుగుతూ ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తున్నాయని, కొన్నిసార్లు ఇళ్లలోకి ప్రవేశించి తినే వస్తువులు తీసుకెళ్తున్నాయని, గుంపులుగా దాడి చేసి కొంతమందిని కరిచిన ఘటనలు కూడా జరిగాయని వాసులు తెలిపారు. కోతులు ఇళ్ల పైకప్పులపై తిరుగుతూ ప్రజలు భయంతో జీవించాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజలను రక్షించేందుకు మున్సిపల్ శాఖ ప్రత్యేక నిధులు కేటాయించి కోతులను పట్టుకోవాలని, సమస్యను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని వాసులు కోరారు. ఈ కార్యక్రమంలో టీచర్స్ కాలనీ వాసులు అయిలేని మల్లికార్జున రెడ్డి, కైలసం, పూదరి మల్లేశం, సావుల రవీందర్, సదానందం, దుర్గయ్య, కనుకయ్య, గోవింద్ సాయి తదితరులు పాల్గొన్నారు.

## గాంధీ విగ్రహానికి నివాళులు ఉపాధి హామీ బిల్లుపై నిరసన



**హుస్నాబాద్, డిసెంబర్ 27 (నీలగిరి ఎక్స్ ప్రెస్)** హుస్నాబాద్ గాంధీ చౌక్ వద్ద మంత్రి పొన్నం ప్రభాకర్ మహాత్మా గాంధీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం ఉపాధి హామీ పథకాన్ని నిర్వీర్యం చేస్తూ కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన బిల్లుకు వ్యతిరేకంగా నిరసన తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి సమస్యలను దృష్టిలో పెట్టుకొని సోనియా గాంధీ, మన్మోహన్ సింగ్ నాయకత్వంలో మహాత్మా గాంధీ ఉపాధి హామీ పథకం ప్రవేశపెట్టారని, కానీ ఇప్పుడు కేంద్ర ప్రభుత్వం ఆ పథకాన్ని నిర్వీర్యం చేస్తోందని ఆయన అన్నారు. మహాత్మా గాంధీ పేరును తొలగించి కొత్త పేరును పెట్టడం ఆయన అవమానానికి దారితీస్తుందని పేర్కొన్నారు. నెహ్రూ, ఇందిరా గాంధీ, మహాత్మా గాంధీ పేర్లను తొలగించే కుట్ర చేస్తున్న కేంద్ర ప్రభుత్వ నిరంకుశ వైఖరికి రాష్ట్రవ్యాప్తంగా నిరసనలు తెలపాలని, గాంధీ ఫోటోలు పెట్టుకొని ఉపాధి కార్యక్రమాలు నిర్వహించాలని పిలుపునిచ్చారు.

## పోగొట్టుకున్న ఫోన్‌ను రికవరీ చేసిన పోలీసులు



**కరీంనగర్ రూరల్, డిసెంబర్ 27 (నీలగిరి ఎక్స్ ప్రెస్)** నగునూరుకు చెందిన గడ్డం సాత్విక్ తన ఒప్పో ఫోన్‌ను నవంబర్ 20న ప్రతిమ మెడికల్ కాలేజీలో పోగొట్టుకున్నాడు. ఈ విషయంపై రూరల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, పోలీసులు సీఐఆర్ టెక్నాలజీ ద్వారా ఆ ఫోన్ నల్గొండలో ఉన్నట్లు గుర్తించి రికవరీ చేశారు. శనివారం రూరల్ పీఎస్ ఇన్స్పెక్టర్ నిరంజన్ రెడ్డి ఫోన్‌ను యజమాని సాత్విక్‌కు అప్పగించారు. ఫోన్ రికవరీలో కృషి చేసిన కానిస్టేబుల్ విశ్వతేజను ఇన్స్పెక్టర్ నిరంజన్ రెడ్డి అభినందించారు.

## మున్సిపల్ ఎన్నికలే లక్ష్యం



**కరీంనగర్, డిసెంబర్ 27 (నీలగిరి ఎక్స్ ప్రెస్)** : కరీంనగర్ కార్పొరేషన్‌లో రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయాన్ని లక్ష్యంగా పెట్టుకుని జిల్లా కాంగ్రెస్ కమిటీ కార్యాలయం ఇందిరా గార్డెన్స్‌లో ముఖ్య కార్యకర్తల సమావేశం జరిగింది. జిల్లా అధ్యక్షుడు, చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం మాట్లాడుతూ నగరంలోని 66 డివిజన్లను 6 జోన్లుగా విభజించి, ప్రతి జోన్‌కు ముగ్గురు సభ్యులను నియమించనున్నట్లు తెలిపారు. పార్టీ కోసం కష్టపడి పనిచేసే కార్యకర్తలకు పదవుల్లో ప్రాధాన్యం ఇవ్వనున్నట్లు స్పష్టం చేశారు. రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్ జెండా ఎగురవేయడానికి ప్రతి కార్యకర్త సైనికుడిలా పనిచేయాలని ఆయన పిలుపునిచ్చారు. నగర అభివృద్ధి కోసం ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. ఈ సమావేశంలో పీసీసీ ప్రతినిధులు, సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి, ఆరేపల్లి మోహన్, ఒడితల ప్రణవ్, నగర కాంగ్రెస్ కార్పొరేషన్ అధ్యక్షులు వైద్యుల అంజన్ కుమార్, పడాల రాహుల్, కోమటిరెడ్డి పద్మాకర్ రెడ్డి, ఎండి తాజ్, మడుపు మోహన్, కొరివి అరుణ్ కుమార్, శ్రావణ్ నాయక్, సిరాజ్ హుస్సేన్, చర్ల పద్మ, వెన్నం రజిత రెడ్డి, అహ్మద్ అలీ, కుర్ర పోచయ్యతో పాటు 66 డివిజన్ల అధ్యక్షులు, పెద్ద సంఖ్యలో కార్యకర్తలు పాల్గొన్నారు.

## స్కూల్‌లో బోర్ ప్రారంభం



**కొత్తపల్లి మండలం, డిసెంబర్ 27 (నీలగిరి ఎక్స్ ప్రెస్)** : కొత్తపల్లి మండలంలోని ఎలగందల్ గ్రామ జిల్లా ప్రజా పరిషత్ హై స్కూల్‌లో మంచినీటి సమస్యతో ఇబ్బంది పడుతున్న విద్యార్థుల కోసం బోర్ ఏర్పాటు చేశారు. సమస్యను తెలియజేయగానే కరీంనగర్ పార్లమెంట్ సభ్యుడు, కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ వెంటనే స్పందించి బోర్ మంజూరు చేశారు. ఈరోజు మోటార్ అమర్చి బోర్ ప్రారంభించడంతో గ్రామస్తులు ఆనందం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మంత్రి సంజయ్‌కు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో స్కూల్ హెడ్‌మాస్టర్ ఆనందం, బీజేపీ మాజీ మండల అధ్యక్షుడు కడార్ల రతన్ కుమార్, దావా సతీష్, గుండా సిద్దు, మిట్ట వంశీ, అక్షయ్ పాల్గొన్నారు.

# సుందరగిరిలో ఎన్ఎస్ఎస్ శీతాకాల ప్రత్యేక శిబిరం ప్రారంభం

**హుస్నాబాద్, డిసెంబర్ 27 (నీలగిరి ఎక్స్ ప్రెస్)**
సుందరగిరి గ్రామంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల హుస్నాబాద్ ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో ఏడు రోజులపాటు శీతాకాల ప్రత్యేక శిబిరం ప్రారంభమైంది. ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన గ్రామ సర్పంచ్ జంగా శిరీష రమణ రెడ్డి విద్యార్థులు సమాజ సేవలో భాగస్వాములై గ్రామ అభివృద్ధికి కృషి చేయాలని సూచించారు. పచ్చదనం, పరిశుభ్రత, ఆరోగ్యం, మూఢనమ్మకాల నిర్మూలన, సామాజిక దురాచారాల వ్యతిరేక పోరాటం వంటి కార్యక్రమాల ద్వారా సమాజ శ్రేయస్సుకు తోడ్పడాలని హితవు పలికారు. ఎన్ఎస్ఎస్ ఇందిరాగాంధీ జాతీయ అవార్డు గ్రహీత సంగోజు మనోహరాచారి జాతీయ సేవా పథకం లక్ష్యాలను




వివరించి, విద్యార్థులకు దాని ప్రయోజనాలను తెలియజేశారు. వాలంటీర్లు ఆలపించిన గానం అందరినీ ఆకట్టుకుంది. కళాశాల ప్రిన్సిపాల్ విజయగిరి బిక్షపతి గ్రామాలు అభివృద్ధి చెందితేనే దేశం అభివృద్ధి చెందుతుందని, విద్యార్థులు ఎన్ఎస్ఎస్ ద్వారా గ్రామాభివృద్ధిలో భాగస్వాములు కావాలని కోరారు. మండల విద్యాధికారి వోజ్జల పావని మానవసేవే మాధవసేవ అని, సేవ వలన వ్యక్తిత్వ వికాసం జరుగుతుందని పేర్కొన్నారు. గ్రామ వైద్యాధికారిణి డాక్టర్ నిహారిక స్త్రీలు ఎదుర్కొంటున్న ఆరోగ్య సమస్యలపై అవగాహన కల్పించాలని వాలంటీర్లను కోరారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి డాక్టర్ బి. ఇందిర నైనా దేవి ఏడు రోజుల కార్యక్రమాల పట్టికను వివరించారు. ఉపసర్పంచ్ రాజు యువత వివేకానందుని స్ఫూర్తితో ముందుకు సాగాలని సూచించారు. అనంతరం డాక్టర్ బాలరాజు వాలంటీర్లతో గ్రామాభివృద్ధి కోసం ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్, వార్డు సభ్యులు, అధ్యాపకులు, వాలంటీర్లు పాల్గొన్నారు.

# ప్రభుత్వ ఆసుపత్రిలో అధునాతన వైద్య సేవలు



**పెద్దపల్లి, డిసెంబర్ 27 (నీలగిరి ఎక్స్ ప్రెస్)**
పెద్దపల్లి ప్రభుత్వ ఆసుపత్రిలో క్లిష్టమైన అర్థోస్కోపిక్ శస్త్రచికిత్స విజయవంతంగా నిర్వహించారు. రాగినేడు గ్రామానికి చెందిన 51 ఏళ్ల వ్యక్తి భుజం నొప్పితో బాధపడుతుండగా, ఆసుపత్రి సూపరింటెండెంట్ శ్రీధర్ సూచనల మేరకు ఆర్థోస్కోపిక్ సర్జన్ డాక్టర్ శశికాంత్, డాక్టర్ వినయ్, డాక్టర్ భవాని ఆధ్వర్యంలో శస్త్రచికిత్స చేపట్టారు. ప్రైవేటు ఆసుపత్రుల్లో దాదాపు రెండు లక్షల రూపాయలు ఖర్చయ్యే ఈ సర్జరీని ప్రభుత్వ ఆసుపత్రిలోనే మొదటిసారిగా విజయవంతంగా నిర్వహించడం విశేషం. అదేవిధంగా కొత్తపల్లి గ్రామానికి చెందిన 26 ఏళ్ల గర్భిణి మహిళకు కవల పిల్లల ప్రసవం అత్యవసర పరిస్థితుల్లో ప్రభుత్వ మాతా శిశు ఆసుపత్రిలో జరిగింది. రక్తకణాలు తక్కువగా ఉండటం, హై బీపీ సమస్యలతో ఆపరేషన్ క్లిష్టంగా మారినప్పటికీ, డాక్టర్ మిరాజ్ ఫాతిమా, డాక్టర్ భవాని ఆధ్వర్యంలో శస్త్రచికిత్స విజయవంతమైంది. పుట్టిన కవల పిల్లలను ఏఎన్ సీయూలో చేర్చగా, తల్లిని ఐసియూలో చికిత్స అందిస్తున్నారు. ఈ రెండు శస్త్రచికిత్సలను విజయవంతంగా నిర్వహించిన వైద్య బృందాన్ని, ఆసుపత్రి సూపరింటెండెంట్ శ్రీధర్‌ను ఎమ్మెల్యే చింతకుంట విజయరమణ రావు అభినందించారు. ప్రజలు ప్రభుత్వ ఆసుపత్రి సేవలను విశ్వసించి వినియోగించుకోవాలని ఆయన పిలుపునిచ్చారు.

# కాంగ్రెస్ పార్టీ హవా

-సర్పంచ్ ఎన్నికల్లో ఘన విజయం



**హుజురాబాద్, డిసెంబర్ 27 (నీలగిరి ఎక్స్ ప్రెస్):**
రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత జరిగిన అన్ని ఎన్నికల్లో విజయ పరంపర కొనసాగుతుందని, తాజాగా జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో కరీంనగర్ పార్లమెంట్ పరిధిలో కాంగ్రెస్ బలపరిచిన సర్పంచ్ అభ్యర్థులు ఘన విజయం సాధించారని హుజురాబాద్ నియోజకవర్గ ఇంచార్జి వొడితల ప్రణవ్ తెలిపారు. కరీంనగర్ ఇందిరా భవన్‌లో జరిగిన సర్పంచుల సన్మాన కార్యక్రమానికి మంత్రి పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్యేలు మేడిపల్లి సత్యం, ఆది శ్రీనివాస్, కవ్వంపల్లి సత్యనారాయణ, ఎమ్మెల్సీ వెంకట్, మాజీ మంత్రి జీవన్ రెడ్డి, సుడా చైర్మన్ నరేందర్ రెడ్డి, ఇతర నాయకులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రణవ్ మాట్లాడుతూ హుజురాబాద్‌లో అధిక స్థానాల్లో కాంగ్రెస్ అభ్యర్థులు గెలిచారని, నిధుల కేటాయింపులో హుజురాబాద్‌కు ప్రాధాన్యం ఇవ్వాలని కోరారు. ఇద్దరు ఎంపీలు, ఒక ఎమ్మెల్యే ఎంత ప్రచారం చేసినా కాంగ్రెస్ విజయాన్ని ఆపలేకపోయారని, ఇదే స్ఫూర్తితో సంక్షేమ పథకాలను ప్రజలకు చేరవేయడానికి కృషి చేస్తామని అన్నారు. నూతనంగా ఎన్నికైన సర్పంచులకు శుభాకాంక్షలు తెలుపుతూ, పార్టీ నిర్మాణం కోసం కష్టపడ్డ ప్రతి కార్యకర్తకు తగిన గుర్తింపు ఇవ్వాలని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో హుజురాబాద్ కాంగ్రెస్ నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ప్రభుత్వ ఆస్పత్రికి అంబులెన్స్ పత్రాల అందజేత



**హుజురాబాద్, డిసెంబర్ 27 (నీలగిరి ఎక్స్ ప్రెస్):**
కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ తన సొంత నిధులతో హుజురాబాద్ జనరల్ హాస్పిటల్‌కు అందజేసిన అంబులెన్స్‌కు సంబంధించిన పత్రాలను శనివారం కరీంనగర్ పార్లమెంట్ బీజేపీ వెహికల్ ఇంచార్జి సాంబయిపల్లి శ్రీనివాస్ రెడ్డి ఆస్పత్రి వైద్యాధికారి నల్ల నారాయణరెడ్డికి అందజేశారు. ఈ అంబులెన్స్ ద్వారా హుజురాబాద్ నియోజకవర్గ ప్రజలకు అత్యవసర వైద్య సేవలు మరింత సులభంగా అందుతాయని ఆస్పత్రి అధికారులు తెలిపారు. కరోనా కాలం నుంచి ఇప్పటి వరకు ఆస్పత్రికి అవసరమైన పరికరాలను సమకూర్చుతూ సహకారం అందిస్తున్నారని వైద్యులు గుర్తుచేశారు.

# స్కానింగ్ కేంద్రాలపై సమీక్ష



**మంచిర్యాల, డిసెంబర్ 27 (నీలగిరి ఎక్స్ ప్రెస్)**
జిల్లాలోని అన్ని స్కానింగ్ కేంద్రాల్లో నిర్వహించే వివరాలను నిర్ణీత నమూనాలో తప్పనిసరిగా నమోదు చేయాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డా. అనిత సూచించారు. నస్పూర్‌లో జరిగిన జిల్లా అడ్వైజరీ కమిటీ సమావేశంలో ఆమె మాట్లాడుతూ, పిసిపిఎన్‌డిటి చట్టం ప్రకారం జిల్లాలో 53 స్కాన్ కేంద్రాలు పనిచేస్తున్నాయని, వీటిలో 4 ప్రభుత్వ, 49 ప్రైవేటు కేంద్రాలు ఉన్నాయని తెలిపారు. ప్రతి స్కానింగ్ కేంద్రంలో వైద్యుల వివరాలు, రుసుములు గోడపై ప్రదర్శించాలని, గర్భవతులకు కుర్చీలు, త్రాగునీటి సౌకర్యం కల్పించాలని ఆదేశించారు. లింగ నిర్ధారణ చేయరాదని స్పష్టంగా పోస్టర్లు, ఫ్లెక్సీల ద్వారా ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. గర్భవతుల స్కానింగ్ వివరాలను ఫార్మ్-ఎఫ్‌లో నమోదు చేసి, వారి సంతకం తప్పనిసరిగా తీసుకోవాలని తెలిపారు. ప్రైవేట్ ఆసుపత్రులు, స్కానింగ్ కేంద్రాలు గర్భిణులు, తల్లులు, కుటుంబ సభ్యులకు అవగాహన కల్పించాలని, మండలాల వారీగా ప్రచార కార్యక్రమాలు చేపట్టాలని కమిటీ నిర్ణయించింది. బర్త్ రూట్ ఆసుపత్రికి సంబంధించిన స్కానింగ్ మెషిన్‌ను పోర్టల్‌లో అప్లోడ్ చేసినట్లు అధికారులు తెలిపారు. ఈ సమావేశంలో డా. అరుణశ్రీ, యం.కృష్ణమూర్తి, డా. చుంచు రాజ్ కిరణ్, డా. నలుమాసు శ్రీదేవి, ప్రశాంతి, వెంకటేశ్వర్లు, రమేష్, సుమన్, హారిక, పద్మ, వసుమతి మార్తా, బుక్క వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

# నీలగిరి ఎక్స్ ప్రెస్ వార్తకు స్పందన

## సమ్మక్క సారలమ్మ జాతర ఏర్పాట్లు వేగవంతం





**పాలకుర్తి, డిసెంబర్ 27 (నీలగిరి ఎక్స్ ప్రెస్):**
ఈశాల తక్కల్లపల్లి శ్రీ సమ్మక్క సారలమ్మ జాతర నిర్వహణపై పట్టింపులేని అధికారులపై భక్తుల ఆవేదనను నీలగిరి ఎక్స్ ప్రెస్‌లో వార్తగా ప్రచురించడంతో నాయకులు, అధికారులు వెంటనే స్పందించారు. శనివారం గ్రామ సర్పంచ్ బండి శ్రీనివాస్ గౌడ్, వార్డు సభ్యులతో కలిసి జాతర ప్రాంగణాన్ని పరిశీలించారు. లక్షకు పైగా భక్తులు వనదేవతలను దర్శించుకునే ఈ జాతరలో త్రాగునీరు, విద్యుత్, స్నానఘట్టాలు, జంపన్న వాగు వంటి సౌకర్యాలను ఆర్‌డబ్ల్యూఎస్ అధికారి అఖిలతో కలిసి పరిశీలించారు. జాతర సమయం దగ్గరపడుతున్నందున పనులను వేగవంతం చేయాలని పాలకవర్గం నిర్ణయించింది. అధికారులు, నాయకులు స్పందించడంతో భక్తులు సంతోషం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ కార్యదర్శి కోడిజుట్టు సుభాష్, ఉప సర్పంచ్ ఒడ్నాల జ్యోతి రాజు, వార్డు సభ్యులు నెరువట్ల అశోక్, సంకరి కుమార్, పన్నాల రాజేశ్వరి, గన్నేవరపు పద్మ తదితరులు పాల్గొన్నారు.

# పేద ప్రజల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం



**పెద్దపల్లి, డిసెంబర్ 27 (నీలగిరి ఎక్స్ ప్రెస్)**
: పెద్దపల్లి నియోజకవర్గ ప్రజల కోసం నిరంతరం పని చేయడం కాంగ్రెస్ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ఎమ్మెల్యే చింతకుంట విజయరమణ రావు అన్నారు. జిల్లా కేంద్రంలోని ఆర్.కే గార్డెన్స్‌లో శనివారం జరిగిన కార్యక్రమంలో ఆయన 245 మంది లబ్ధిదారులకు మొత్తం ₹1,07,57,750 విలువైన సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను స్థానిక నాయకులతో కలిసి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, ముఖ్యమంత్రి సహాయనిధి పంపిణీలో రాష్ట్రవ్యాప్తంగా పెద్దపల్లి ప్రత్యేక స్థానం సంపాదించిందని పేర్కొన్నారు. పేద ప్రజల సంక్షేమం కోసం ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు ప్రజలకు చేరేలా కృషి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో నియోజకవర్గంలోని వివిధ గ్రామాల సర్పంచులు, ఉపసర్పంచులు, కాంగ్రెస్ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు మరియు లబ్ధిదారులు పాల్గొన్నారు.

# అక్రమ ఇసుక రవాణాపై పోలీసుల చర్య




**కరీంనగర్ రూరల్, డిసెంబర్ 27 (నీలగిరి ఎక్స్ ప్రెస్)**
కరీంనగర్ రూరల్ మండలంలో పోలీసులు పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా బొమ్మకల్ గ్రామంలోని ఫ్లైఓవర్ బ్రిడ్జి వద్ద అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకున్నారు. వివరాల ప్రకారం, బొమ్మకల్ గ్రామానికి చెందిన గాలిపెల్లి రాకేష్ తన యజమాని కుమ్మరి రాకేష్ ఆదేశాల మేరకు ఎటువంటి అనుమతులు లేకుండా మానేరు వాగు నుండి ఇసుకను ట్రాక్టర్‌లో చేసి కరీంనగర్ వైపు తరలిస్తుండగా పోలీసులు అడ్డుకున్నారు. నిందితులపై కేసు నమోదు చేసి ట్రాక్టర్‌ను సీజ్ చేసి, తదుపరి చర్యల కోసం కోర్టుకు పంపినట్లు కరీంనగర్ రూరల్ సీఐ ఏ. నిరంజన్ రెడ్డి తెలిపారు.

# ప్రజావాణిలో వీధి కుక్కల నియంత్రణపై కలెక్టర్ ఆదేశాలు




**సిద్దిపేట, డిసెంబర్ 27 (నీలగిరి ఎక్స్ ప్రెస్)**

ఈనెల 29వ తేదీ సోమవారం కలెక్టరేట్‌లో ప్రజావాణి కార్యక్రమం నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ కె. హైమావతి ప్రకటించారు. ప్రజలు ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె సూచించారు. జిల్లాలో వీధి కుక్కల నియంత్రణకు సంబంధించి శనివారం పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో పోలీస్, మున్సిపల్, గ్రామపంచాయతీ, వైద్య ఆరోగ్య, విద్య, క్రీడలు మరియు యువజన శాఖల అధికారులతో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సుప్రీంకోర్టు మార్గదర్శకాలు, రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల ప్రకారం కుక్కల నియంత్రణకు ప్రణాళికాబద్ధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. బస్టాండ్లు, రైల్వే స్టేషన్లు, విద్యాసంస్థలు, ఆస్పత్రులు, కార్యాలయాలు, జాతీయ రహదారులు, పంచాయతీరాజ్ రహదారుల వెంట ఉన్న కుక్కల వివరాలను సేకరించాలని సూచించారు. ప్రతి మున్సిపాలిటీతో పాటు నియోజకవర్గాల వారీగా గ్రామీణ ప్రాంతాల్లో షెల్టర్ హోమ్‌లు నిర్మించి, కుక్కలను అక్కడికి తరలించి కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు చేసి వాటిని షెల్టర్ హోమ్‌లలో ఉంచాలని ఆదేశించారు. దీంతో రహదారులపై జరిగే ప్రమాదాలు, కుక్క కాట్ల సమస్యలు తగ్గుతాయని కలెక్టర్ పేర్కొన్నారు. ఈ సమావేశంలో జిల్లా పశుసంవర్ధకశాఖ అధికారి కొండల్ రెడ్డి, అడిషనల్ డీసీపీ సుభాష్ చంద్రబోస్, డిపిఓ రవీందర్, డిఎం అండ్ హెచ్ ఓ డాక్టర్ ధనరాజ్, జిల్లా రవాణా అధికారి లక్ష్మణ్, జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి వెంకట నరసయ్య, మున్సిపల్ కమిషనర్లు, నేషనల్ హైవే, ఆర్ అండ్ బి, విద్యాశాఖ అధికారులు పాల్గొన్నారు.

# బ్యాంకు కాలనీ రోడ్లపై విమర్శలు అభివృద్ధి హామీ





**కరీంనగర్, డిసెంబర్ 27 (నీలగిరి ఎక్స్ ప్రెస్):**

కరీంనగర్ నగరంలోని బ్యాంకు కాలనీతో పాటు డివిజన్‌లోని వీధులన్నీ సీసీ రోడ్లు లేక మట్టి రోడ్లుగా మారి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని బీజేపీ 24వ (పాత 40వ) డివిజన్ ఇంచార్జ్ ఊగిలే సుధాకర్ పటేల్ విమర్శించారు. గత పాలకులు గెలిచిన తర్వాత అభివృద్ధి పనులు పట్టించుకోకపోవడంతో డివిజన్ వెనుకబడిందని, ప్రజలు దుమ్ము, మట్టి సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారని ఆయన అన్నారు. గెలిచే వరకు వాగ్దానాలు చేసి, గెలిచిన తర్వాత ప్రజల సమస్యలను విస్మరించారని ఆరోపించారు. వచ్చే కార్పొరేషన్ ఎన్నికల్లో ప్రజలు గత పాలకులకు బుద్ధి చెప్పాలని, తాను గెలిస్తే బీజేపీ కేంద్ర మంత్రి బండి సంజయ్ ఆశీర్వాదంతో డివిజన్‌లోని రోడ్లన్నీ అందంగా తీర్చిదిద్దే బాధ్యత తీసుకుంటానని సుధాకర్ పటేల్ హామీ ఇచ్చారు. ప్రజల ఆశీర్వాదంతో సేవకుడిగా పని చేస్తానని ఆయన ఒక ప్రకటనలో తెలిపారు.

# ఏఐసిసి కార్యదర్శిని కలిసిన కిసాన్ సెల్ బాలరాజ్

**కడ్తాల్, డిసెంబర్ 27 ( నీలగిరి ఎక్స్ ప్రెస్) :**

ఏఐసిసి కార్యదర్శి చల్లా వంశీచంద్ రెడ్డిని కడ్తాల్ మండల కాంగ్రెస్ కిసాన్ సెల్ అధ్యక్షులు అర్కోటం బాలరాజ్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్బంగా రాష్ట్ర ప్రభుత్వం రైతుల సంక్షేమం కోసం ప్రవేశపెడుతున్న పథకాలను రైతులకు వివరించాలని వంశీచంద్ రెడ్డి బాల్ రాజు కు సూచించారు.



# మాంజా దారాలపై నిషేధం కలెక్టర్ పర్యటనలు






**సిద్దిపేట, డిసెంబర్ 27 (నీలగిరి ఎక్స్ ప్రెస్):**

జిల్లాలో ప్రమాదాలకు గురి చేస్తున్న మాంజా దారాల విక్రయాన్ని పూర్తిగా నిషేధించినట్లు జిల్లా కలెక్టర్ కె. హైమావతి ప్రకటించారు. గాలిపటాల కోసం సాధారణ దారాల బదులుగా మాంజా దారాలు వాడటం వల్ల వాహనదారులు, పశువులు, పక్షులు తరచుగా ప్రమాదాలకు గురవుతున్నాయని, ఇకపై జిల్లాలో ఎక్కడా మాంజా దారాలను అమ్మరాదని వ్యాపారులకు హెచ్చరికలు జారీ చేశారు. ఆదేశాలను ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ స్పష్టం చేశారు. చిన్నకోడూర్ మండలం ఇబ్రహీం నగర్ గ్రామంలో కలెక్టర్ పలు పర్యటనలు నిర్వహించారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ఆకస్మికంగా సందర్శించి అటెండెన్స్ రిజిస్టర్ పరిశీలించారు. విద్యార్థుల హాజరు శాతం పెంచాలని, వచ్చే అకడమిక్‌లో ఎక్కువ అడ్మిషన్లు వచ్చేలా చర్యలు తీసుకోవాలని ఉపాధ్యాయులకు సూచించారు. మధ్యాహ్న భోజనం చేస్తున్న విద్యార్థులతో మాట్లాడి ఆహారం నాణ్యతను తెలుసుకున్నారు. వంట సిబ్బందికి రుచికరంగా వండాలని, కిచెన్ గార్డెన్‌లో మునగ మొక్కలు నాటాలని సూచించారు. తదుపరి తెలంగాణ మెడల్ స్కూల్, జూనియర్ కాలేజీని సందర్శించి పిల్లలకు చదువు, భోజనం, సదుపాయాలపై ఆరా తీశారు. రోజూ ఒక గంట ఫిజికల్ యాక్టివిటీ, యోగా, ధ్యానం చేయాలని ఉపాధ్యాయులకు సూచించారు. 10వ తరగతి విద్యార్థులతో మాట్లాడుతూ లక్ష్యం, క్రమశిక్షణ, ఏకాగ్రత ప్రాముఖ్యతను వివరించారు. గ్రామంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని కూడా పరిశీలించి రోగులకు అందించే వైద్య సేవలపై సమీక్ష చేశారు. అటెండెన్స్ రిజిస్టర్, ఓపి రిజిస్టర్ తనిఖీ చేసి, సిబ్బంది సెలవుల్లో ఉంటే తప్పనిసరిగా సమాచారం ఇవ్వాలని ఆదేశించారు. ఆసుపత్రి ప్రాంగణం పరిశుభ్రంగా ఉంచాలని పంచాయతీ కార్యదర్శిని ఆదేశించారు. మాంజా దారాల నిషేధంతో పాటు విద్య, ఆరోగ్య రంగాల్లో కలెక్టర్ పర్యటనలు ప్రజల్లో విశ్వాసం కలిగించాయి.

# వీర బాల్ దివస్ పారా స్విమ్మర్ నికేష్ కిరణ్ సన్మానం





**నిజామాబాద్, డిసెంబర్ 27 (నీలగిరి ఎక్స్ ప్రెస్):**

గాజుల్ పేట్ గురుద్వార్‌లో వీర బాల్ దివస్ కార్యక్రమం భక్తిశ్రద్ధలతో ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ ముఖ్య అతిథిగా హాజరై, సాహిబ్జాదాల త్యాగం దేశభక్తి, ధైర్యసాహసాలకు చిరస్మరణీయ ప్రతీక అని పేర్కొన్నారు. చిన్న వయసులోనే ధర్మ పరిరక్షణ కోసం ప్రాణత్యాగం చేసిన వారి వీరత్వం ప్రతి భారతీయుడికి స్ఫూర్తినిస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి నాగొల్ల లక్ష్మీనారాయణ, మాజీ కార్పొరేటర్ ప్రభాకర్, మండల అధ్యక్షుడు బాబీ సింగ్, గురుద్వార్ నిర్వాహకులు, సిక్కు సంఘ నాయకులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. అంతర్జాతీయ, జాతీయ స్థాయిల్లో విజయాలు సాధించిన పారా స్విమ్మర్ నికేష్ కిరణ్ కశేట్వర్‌ను ఎమ్మెల్యే ఘనంగా సన్మానించారు. దుబాయ్‌లో జరిగిన ఆసియన్ పారా యూత్ స్విమ్మింగ్ ఛాంపియన్‌షిప్‌లో మూడు బ్రాంజ్ మెడల్స్ సాధించడంతో పాటు, జాతీయ స్థాయిలో గోల్డ్ మెడల్స్ గెలిచి “బెస్ట్ స్విమ్మర్ అవార్డు” అందుకోవడం నిజామాబాద్ పట్టణానికి గర్వకారణమని ఆయన అన్నారు. కఠినమైన శ్రమ, పట్టుదలతో సాధించిన ఈ విజయాలు యువతకు, ముఖ్యంగా పారా క్రీడాకారులకు ప్రేరణగా నిలుస్తాయని ఎమ్మెల్యే అభినందించారు. భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించి దేశానికి, రాష్ట్రానికి, నిజామాబాద్ పట్టణానికి మరింత కీర్తి తీసుకురావాలని ఆకాంక్షించారు.

# దేవరకొండ నియోజకవర్గాన్ని మరో కొండంగల్ గా తీర్చిదిద్దుతా






**ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్.**

**దేవరకొండ, డిసెంబర్ 27. (నీలగిరి ఎక్స్ ప్రెస్).**

దేవరకొండ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ బలపరిచిన నూతన సర్పంచ్‌లు, ఉపసర్పంచ్‌లు మరియు వార్డు సభ్యుల ఆత్మీయ సన్మాన కార్యక్రమంలో నల్గొండ ఎంపీ కుందురు రఘువీర్ రెడ్డితో కలిసి ఎమ్మెల్యే బాలు నాయక్ పాల్గొని, నూతన సర్పంచులను, శాలువాతో సత్కరించి, శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, ప్రజలు ఇచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని గ్రామాల నూతన పాలకవర్గాలకు సూచించారు. నిత్యం గ్రామాల్లో ఉంటూ ప్రజా సమస్యల పరిష్కారానికి కృషిచేయాలని కోరారు. ప్రజలు ఇచ్చిన గుర్తింపును నిలబెట్టుకోవాలన్నారు. గ్రామాభివృద్ధి చేయడంతో పాటు పల్లెల్లో పరిశుభ్రతకు చర్యలు తీసుకోవాలన్నారు. ప్రజా ప్రభుత్వంపై ప్రజలు పెట్టుకున్న నమ్మకాన్ని నిలబెట్టుకున్నామని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ప్రజల సంతోషమే లక్ష్యంగా ఇచ్చిన ఆరు గ్యారంటీలను అమలు చేస్తున్నామని, త్వరలో మిగిలిన హామీల్ని కూడా అమలు చేస్తామన్నారు. దేవరకొండ నియోజకవర్గంలో జరిగిన మూడోవ విడత గ్రామ పంచాయతీ ఎన్నికల్లో అధికార కాంగ్రెస్ పార్టీ తన ఆధిపత్యాన్నినిలబెట్టుకుందని తెలిపారు. 180చోట్ల అధికార కాంగ్రెస్ పార్టీ మద్దతుదారులు గెలుపొందగా, 50స్థానాల్లో బీజేపీ, బీఆర్ఎస్ బలపరిచిన అభ్యర్థులు గెలుపొందారని చెప్పారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, యూత్ కాంగ్రెస్ నాయకులు, మహిళలు, నూతన సర్పంచులు, యువకులు తదితరులు పాల్గొన్నారు.

## వడ్డెర సంఘం ఆధ్వర్యంలో సర్పంచ్ లకు సన్మానం



**హైదరాబాద్ డిసెంబర్ 27.(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
హైదరాబాదులో బాగ్ లింగంపల్లి సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో తెలంగాణలో ఇటివల నిర్వహించిన గ్రామపంచాయతీ ఎన్నికలలో గెలుపొందిన వడ్డెర కులానికి సంబంధించిన 96మంది సర్పంచులు, 46 మంది ఉపసర్పంచ్లుగా 68 మంది వార్డు మెంబర్లుకు తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు శివరాత్రి ఆయిల్ మల్లు ఆధ్వర్యంలో వీరందరికీ సన్మాన కార్యక్రమం ఏర్పాటు చేశారు ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్రంలో ఉన్నా 33 జిల్లాల వారు ఈ యొక్క సమావేశంలో పాల్గొన్నారు. దేవరకొండ నియోజకవర్గం నుండి వడ్డెర కులానికి సంబంధించిన డిండి, చందంపేట ,నేరడ గొమ్మ , కొండమల్లేపల్లి, పీఏ పల్లి, చింతపల్లి మండలాల నుండి వివిధ హోదాలో ఉన్న 34 మంది ఈ యొక్క కార్యక్రమం లో పాల్గొన్నారు.దేవరకొండ వడ్డెర సంఘం నియోజకవర్గ అధ్యక్షులు ఇరగదిండ్ల కృష్ణ ఒకప్రకటనలో తెలిపారు.

## నూతన సర్పంచ్ లకు సన్మానం

### ఎమ్మెల్యే బాలు నాయక్



**దేవరకొండ డిసెంబర్ 27.(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
దేవరకొండ నియోజకవర్గం వర్గం వ్యాప్తంగా ఇటివల నిర్వహించిన గ్రామ పంచాయతీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ నుండి గెలుపొందిన అభ్యర్థుల కు శనివారం పట్టణంలోని సాయి శివ గార్డెన్లో సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా నల్గొండ ఎంపీ కుందురు రఘువీర్ రెడ్డి పాల్గొన్నారు. ఎమ్మెల్యే బాలు నాయక్ చేతులమీదుగా డిండి మండలంలో ని గోనబోయినపల్లి గ్రామానికి చెందిన సర్పంచ్ వర్కాల బాల నారాయణ ను, ఉప సర్పంచ్ బద్దెల బాలలింగయ్యను, శాలువాను కప్పి, బహుమతి ని అందజేసి సన్మానించారు.ఈకార్యక్రమంలో దొంతునేని వెంకటేశ్వరరావు,కాంగ్రెస్ పార్టీ డిండి మండల వర్కింగ్ ప్రెసిడెంట్ బద్దెల శ్రీనివాస్ యాదవ్, మండల పార్టీ అధ్యక్షుడు నల్లవెల్లి రాజేష్ రెడ్డి,బాలకృష్ణ,పులిజాల శ్రీనివాస్, గ్రామ కార్య కర్తలు తదితరులు పాల్గొన్నారు.

## షాద్ నగర్‌లో వరి ధాన్యం ట్రాక్టర్ బోల్తా

### -పోలీసుల సహాయక చర్యలు- - శభాష్ పోలీస్ అంటూ ప్రజల ప్రశంసలు





**షాద్ నగర్, డిసెంబర్ 27(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
: షాద్ నగర్ పట్టణంలో ఊహించని ఘటన చోటుచేసుకుంది. మహబూబ్ నగర్ పాత జాతీయ రహదారిపై మొత్కూర్ నుంచి షాద్ నగర్ వ్యవసాయ మార్కెట్‌కు వరి ధాన్యం తరలిస్తున్న ట్రాక్టర్ టైరు పేలిపోవడంతో బోల్తా పడింది. వడ్ల బస్తాలతో నిండిన ట్రాక్టర్ రహదారిపై పడిపోవడంతో క్షణాల్లోనే ట్రాఫిక్ నిలిచిపోయింది.సమాచారం అందుకున్న వెంటనే ట్రాఫిక్ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని చాకచక్యంగా వ్యవహరించారు. వడ్ల బస్తాలను డీసీఎం లోకి ఎక్కించి, జెసిబి సహకారంతో ట్రాక్టర్ ట్రాలీని పక్కకు తరలించారు. సుమారు గంటపాటు సాగిన ఈ చర్యలో లేబర్‌ను రప్పించి సమస్యను పరిష్కరించారు.పెను ప్రమాదం తప్పిన ఈ సందర్భంలో ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు. ట్రాఫిక్ హెడ్ కానిస్టేబుల్ జితేందర్ రెడ్డి, సహచర సిబ్బంది చూపిన చురుకుదనం, కర్తవ్యనిష్ఠను చూసి అక్కడున్నవారు “శభాష్ పోలీస్” అంటూ ప్రశంసలు కురిపించారు.

## దైవచింతనతోనే మానసిక ప్రశాంతత సాధ్యం





### కేంద్ర ఖాది మరియు చిన్న పరిశ్రమల పూర్వ డైరెక్టర్ ఈగ మల్లేశం

**వర్ధన్నపేట, డిసెంబర్ 27(నీలగిరి ఎక్స్ ప్రెస్**
: దైవచింతనతోనే మనిషికి ముక్తి లభించి మానసిక ప్రశాంతత సాధ్యమవుతుందని కేంద్ర ఖాది మరియు చిన్న పరిశ్రమల పూర్వ డైరెక్టర్ ఈగ మల్లేశం అన్నారు.వరంగల్ జిల్లా వర్ధన్నపేట మండలం ఇల్లంద గ్రామం ఆకేరు ఒడ్డునగల శ్రీ అయ్యప్ప స్వామి వారి దేవాలయంలోకేంద్ర ఖాది మరియు చిన్న పరిశ్రమల పూర్వ డైరెక్టర్ ఈగ మల్లేశం- సంగీత దంపతుల ఆధ్వర్యంలో హరిహర పుత్రుడు అయ్యప్ప స్వామి మహా పడిపూజ కార్యక్రమం కన్నుల పండువగా జరిగింది. స్వామియే శరణం అయ్యప్ప... శరణం శరణం అయ్యప్ప.. స్వామి శరణం అయ్యప్ప అంటూ



అయ్యప్ప స్వామి నామ స్మరణ, శరణు ఘోషతో ఆలయ ప్రాంగణం మార్మోగింది. స్వామివారి పడిపూజ కార్యక్రమంలో అయ్యప్ప దీక్షకులు, భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. రఘునందన్ గురుస్వామి, కృపాకర్ రాజు గురు స్వామి వారి అయ్యప్ప భజన మండలి ఆధ్వర్యంలో ఈగ మల్లేశం కుటుంబ సభ్యులు అయ్యప్ప స్వామి వారి ప్రతిమకు పంచామృతాలతో ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు.ఈ సందర్భంగా అయ్యప్ప స్వామి భజన కీర్తనలు, ఆటపాటలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.అయ్యప్ప స్వామి జయ జయ నాదాల నడుమ ఆలయ ప్రాంగణం సందడిగా మారింది.అనంతరం ఈగ మల్లేశం వారి తనయుడు స్వాములతో కలిసి పేటతుల్లి ఆడారు.ఈ సందర్భంగా ఈగ మల్లేశం గురు స్వాములు, పడిపూజ కార్యక్రమానికి సహకరించిన స్వాములకు శాలువా కప్పి సన్మానించారు.అనంతరం నిర్వహించిన మహా అన్నదాన కార్యక్రమంలో అయ్యప్ప స్వాములు, భక్తులు, ప్రజా ప్రతినిధులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## నడవండి.. ఆరోగ్యాన్ని పరిరక్షించుకోండి

### త్రివర్ణ పార్క్ అభివృద్ధి కమిటీ చైర్మన్ బి. అజయ్ సారధి రెడ్డి

**మహబూబాబాద్, డిసెంబర్ 27(నీలగిరి ఎక్స్ ప్రెస్):**
మహబూబాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని 22వ వార్డు ఇందిరా గ్రౌండ్‌లో గల త్రివర్ణ పార్క్ వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్థానిక ఎస్ఎస్‌వివిఎల్ ఫంక్షన్ హాల్‌లో ఆత్మీయ సమ్మేళనం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి విజయ్ కుమార్ అధ్యక్షత వహించారు.ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరైన త్రివర్ణ పార్క్ అభివృద్ధి కమిటీ చైర్మన్ బి. అజయ్ సారధి రెడ్డి మాట్లాడుతూ ప్రతిరోజు నడవడం ద్వారా ఆరోగ్యాన్ని పరిరక్షించుకోవచ్చని, వ్యాయామం ద్వారా మానసిక ఉల్లాసం, ఉత్సాహం పెరుగుతాయని




పేర్కొన్నారు. సమాజంలో రోజురోజుకు పెరుగుతున్న ఆరోగ్య సమస్యలను నివారించాలంటే వాకింగ్ అలవాటు తప్పనిసరి అని ఆయన స్పష్టం చేశారు. వాకింగ్ ద్వారా మనిషి స్వేచ్ఛగా జీవించేలా ఆరోగ్యం సహకరిస్తుందని, అందుకే ప్రతి ఒక్కరూ నడవాలని పిలుపునిచ్చారు.త్రివర్ణ పార్క్‌ను గతంలో కొంతమంది ప్రైవేట్ వ్యక్తులు కబ్జా చేయాలని ప్రయత్నించిన సందర్భంలో, దాన్ని పరిరక్షించి పార్కుగా నామకరణం చేసి 50 లక్షలు వెచ్చించి అభివృద్ధి చేశామని ఆయన గుర్తుచేశారు. భవిష్యత్తులో కూడా పార్క్ అభివృద్ధికి తన వంతు కృషి ఎల్లప్పుడూ ఉంటుందని, ప్రజలకు అందుబాటులో ఉండేలా ముందుకు వెళతానని తెలిపారు.ఈ సందర్భంగా వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బి. అజయ్ సారధి రెడ్డి గారిని ఘనంగా సన్మానించారు. అనంతరం ఇటీవల అవార్డు అందుకున్న నాల్ల ప్రకాష్ గారిని, సీనియర్ వాకర్స్‌ను సన్మానించి కార్యక్రమాన్ని జయప్రదం చేశారు.కార్యక్రమంలో రఫీ, నాల్ల ప్రకాష్, మాజీ ఎంపీటీసీ ముత్యం వెంకన్న, కొలగాని వెంకన్న, సుభాష్ గౌడ్, జానీ, లింగారెడ్డి, సత్యనారాయణ, సాధిక్, గసికంటే వెంకన్న, ప్రభాకర్, చారీ, బషీర్, విజయ్, సునీల్, అశోక్, బెజ్జం రమేష్, సూరయ్య, నర్సింహరావు, రాములు, నర్సయ్య, పెరుగు కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## మహబూబాబాద్లో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పర్యటన

### -నూకల రామచంద్రా రెడ్డి విగ్రహావిష్కరణ సర్పంచులకు సన్మానం

**మహబూబాబాద్, డిసెంబర్ 27(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పర్యటన ఘనంగా జరిగింది. కలెక్టరేట్ సమీపంలో స్వర్గీయ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ మంత్రి నూకల రామచంద్రా రెడ్డి విగ్రహాన్ని పలువురు ప్రజా ప్రతినిధులు కలిసి ఆవిష్కరించారు. అనంతరం ఆర్తీ గార్డెన్స్‌లో నూతనంగా ఎన్నికైన కాంగ్రెస్ పార్టీ సర్పంచుల సన్మాన కార్యక్రమంలో పాల్గొని వారికి స్వీట్లు తినిపించి, శాలువాలు కప్పి ఘనంగా సన్మానించారు.ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి మాట్లాడుతూ, “ఇది పేదవారి ప్రభుత్వం. కల్లిబొల్లి మాటలు చెప్పే ప్రభుత్వం కాదు. పేదవారి కష్టాలు తీర్చి వారికి అండగా నిలిచే ప్రభుత్వం. అలాంటి



ప్రభుత్వంలో సర్పంచులుగా ఎన్నికైనందుకు గర్వపడాలి. ఓడిపోయిన వారు అభద్రతాభావానికి లోను కావద్దు, వారికి కూడా ప్రభుత్వం అండగా ఉంటుంది” అని అన్నారు.56 సంవత్సరాల క్రితం మరణించిన నూకల రామచంద్రా రెడ్డి చేసిన సేవలు, సంస్కరణల వలన ఈరోజు విగ్రహావిష్కరణకు ఎంతో మంది హాజరయ్యారని ఆయన గుర్తుచేశారు. రామచంద్రా రెడ్డి స్ఫూర్తిగా తీసుకొని సర్పంచులు తమ గ్రామాలను అభివృద్ధి పథంలో నడిపించాలని పిలుపునిచ్చారు. లంబాడీలు ఆంధ్రప్రదేశ్‌లో బీసీ రిజర్వేషన్ పొందుతుండగా, తెలంగాణలో ఎస్టీ రిజర్వేషన్ సాధించేందుకు రామచంద్రా రెడ్డి కేంద్రంతో పోరాడారని, గిరిజనులు ఆయన ఫోటో పెట్టుకోవాలని సూచించారు.ఈ నెల 29వ తేదీ నుంచి అసెంబ్లీ సమావేశాలు ప్రారంభమవుతాయని, అవాకులు చెవాకులు పేల్చే నాయకులు అసెంబ్లీకి రావాలని ఆయన వ్యాఖ్యానించారు.ఈ కార్యక్రమంలో ముఖ్యమంత్రి సలహాదారు వేం నరేందర్ రెడ్డి, ఎంపీలు బలరాం నాయక్, రఘురాం రెడ్డి, విప్ రామచంద్రు నాయక్, ఎమ్మెల్యే మురళీ నాయక్, ట్రైకార్ చైర్మన్ బెల్లయ్య నాయక్‌తో పాటు కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## కుటుంబ సభ్యులపైనే ఉగ్ర బెదిరింపులు..

**న్యూఢిల్లీ : డిసెంబర్ 27(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
అమెరికాలో భారత సంతతికి చెందిన ఓ విద్యార్థి అరెస్ట్ అయ్యాడు. కుటుంబ సభ్యులపైనే పలుమార్లు దాడికి పాల్పడటంతోపాటూ.. సొంత ఇంటికి నిప్పు పెట్టేందుకు ప్రయత్నించడంతో అతడిని అదుపులోకి తీసుకున్నారు డల్లాస్ లోని టెక్సాస్ విశ్వవిద్యాలయం లో చదువుతోన్న 22 ఏండ్ల భారత సంతతికి చెందిన విద్యార్థి మనోజ్ సాయి లెల్లా.. తరచూ కుటుంబ



సభ్యులపై ఉగ్ర బెదిరింపులకు దిగుతూ, దాడి చేస్తున్నాడు. అంతేకాదు ఇంటికి కూడా నిప్పు పెట్టేందుకు ప్రయత్నించాడు. దీంతో మనోజ్‌పై కుటుంబ సభ్యులు స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశారు. వారి ఫిర్యాదు మేరకు మనోజ్ సాయి లెల్లాను ఫ్రిస్కో పోలీసులు అరెస్ట్ చేశారు. అయితే, మనోజ్ గత కొన్ని రోజులుగా మానసిక సమస్యలతో బాధపడుతున్నట్లు పోలీసులు పేర్కొన్నారు. ఈ మేరకు దర్యాప్తు చేపట్టినట్లు వెల్లడించారు.

## షూటింగ్ బాల్ పోటీ లో ప్రతిభ కనబర్చిన సుల్తాన్ పూర్ విద్యార్థి



**ఎలిగేడు, డిసెంబర్ 27 (నీలగిరి ఎక్స్ ప్రెస్)**
: మండలం లోని సుల్తాన్ పూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థి కె.అరవింద్ షూటింగ్ బాల్ అసోసియేషన్ ఉమ్మడి కరీంనగర్ జిల్లా స్థాయి పోటీలో పాల్గొని సత్తా చాటాడు. ఈనెల 29 నుండి జనవరి వచ్చేనెల 1 వరకు వరంగల్ జిల్లా వర్ధన్నపేట మండలంలోని జరగబోయే రాష్ట్ర స్థాయి షూటింగ్ బాల్ అసోసియేషన్ పోటీలకు ఎంపికైనట్టు ఎం ఈ వో అనసూరి నరేంద్ర చారి తెలిపాడు. శనివారం అరవింద్ ను అభినందించారు.ఎంఈఓ మాట్లాడుతూ అరవింద్ కు మంచి భవిష్యత్తు ఉందన్నారు.

## ఎలిగేడు లో మొదటి గ్రామసభ

-ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి
-సర్పంచ్ కప్పల ప్రవీణ్




**ఎలిగేడు, డిసెంబర్ 27 (నీలగిరి ఎక్స్ ప్రెస్)**
ఎలిగేడు మండల కేంద్రంలో తొలిసారిగా గ్రామసభను గ్రామ సర్పంచ్ కప్పల ప్రవీణ్ అధ్యక్షతన నిర్వహించారు.ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ అధికారులు అందరూ సమన్వయంతో పనిచేసి సకాలంలో పేద ప్రజలకు అవసరమైన సదుపాయాలు అందించాలని కోరారు. కొత్తగా ఏర్పడిన పాలకవర్గం ఎమ్మెల్యే విజయ రమణారావు సహకారంతో అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రభుత్వ పథకాలు అందేలా కృషి చేస్తామని హామీ ఇచ్చారు.గ్రామంలో తాగునీరు, డ్రైనేజీ వ్యవస్థ, అంగన్వాడి సమస్యలు, లైటింగ్ సమస్యలను పరిష్కరించేందుకు ప్రత్యేక శ్రద్ధ చూపుతామని ఆయన స్పష్టం చేశారు. ప్రజల సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి గ్రామసభ వేదికగా కృషి చేస్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ ముంజం నరేష్ కుమార్, పంచాయతీ కార్యదర్శి అంజలి, ఏఎన్ఎం దేవేంద్ర, వార్డు సభ్యులు, అంగన్వాడి టీచర్లు, ఆశ వర్కర్లు, గ్రామ ప్రజలు పాల్గొని గ్రామసభను విజయవంతం చేశారు.

## గ్రామ సమస్యలపై దృష్టి సారించిన మహిళా సర్పంచ్ లలితమ్మ

-కంసానిపల్లి ప్రజలకు హామీ సమస్యల పరిష్కారానికి కృషి



**ఉప్పునుంతల, డిసెంబర్ 27 (నీలగిరి ఎక్స్ ప్రెస్)**
ఉప్పునుంతల మండల పరిధిలోని కంసానిపల్లి గ్రామంలో రెండు సంవత్సరాలుగా సర్పంచ్ లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్న ప్రజలకు ఊరట లభించింది. నూతనంగా ఎన్నికైన మహిళా సర్పంచ్ లలితమ్మ గ్రామంలోని ప్రతి వార్డు పర్యటించి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఇందిరమ్మ ఇళ్ల సమస్యలు, బిల్లుల సమస్యలు, నీటి సమస్యలు, చెత్తాచెదారం సమస్యలను పరిశీలించి త్వరలోనే పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు.గ్రామ ప్రజలు ఈ సందర్భంగా ఆనందం వ్యక్తం చేస్తూ, కొత్త సర్పంచ్ లలితమ్మపై విశ్వాసం వ్యక్తం చేశారు. ప్రజలతో ఆత్మీయంగా మాట్లాడిన ఆమె, గ్రామ అభివృద్ధి కోసం కృషి చేస్తానని, ప్రతి సమస్యను దశలవారీగా పరిష్కరిస్తానని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ చీమర్ల లలిత వెంకటేశ్వర్లు, ఉప సర్పంచ్ పోల జితేందర్, మాజీ సర్పంచ్ కర్నే లక్ష్మీనారాయణ, పంచాయతీ కార్యదర్శి సురేష్, వార్డు సభ్యులు వెల్టూరి వెంకటయ్య, కొట్టే రజిత, మాచర్ల గెలువమ్మ, బొల్లు సత్యనారాయణ, ఎల్లపాకుల యాదయ్య, కలమండల పుష్పమ్మ, కలమండల రాములు, కలమండల లక్ష్మయ్య, కంపల్లి లక్ష్మమ్మతో పాటు గ్రామ యువకులు, పెద్దలు పాల్గొన్నారు.

# గ్రామ పంచాయతీల నిధులు ఎవరి బిక్ష కావు





-కల్వకుంట్ల తారక రామారావు
-మహబూబాబాద్‌లో బిఆర్ఎస్ సర్పంచుల సన్మాన సభ

**మహబూబాబాద్, డిసెంబర్ 27(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
: మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని పి.ఎస్.ఆర్. గార్డెన్‌లో నూతనంగా ఎన్నికైన బిఆర్ఎస్ సర్పంచులు, ఉపసర్పంచులను ఘనంగా శాలువాలతో సత్కరించి అభినందించారు. ఈ సందర్భంగా బిఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావు మాట్లాడుతూ గ్రామ పంచాయతీలకు వచ్చే నిధులు ఎవరి బిక్ష కాదని, ఆ నిధులను ఆపే హక్కు ఎవరికి లేదని స్పష్టం చేశారు.ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రాన్ని సాధించి రెండు సార్లు ముఖ్యమంత్రిగా పనిచేసిన కేసీఆర్‌ను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇష్టం వచ్చినట్లుగా దూషించడం దుర్మార్గమని విమర్శించారు. రేవంత్ ఒక భాషలో దూషిస్తే, తాను మూడు భాషల్లో సమాధానం ఇస్తానని, గిరిజన భాష గోర్వాటి నేర్చుకొని దానిలో కూడా తిడతానని వ్యాఖ్యానించారు.రెండేళ్ల కాంగ్రెస్ పాలనపై ప్రజల్లో తిరుగుబాటు మొదలైందని, రైతు బంధును ఎగగొట్టిన దొంగ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అని ఆయన ఆరోపించారు. డోర్నకల్ వరకు గోదావరి నీళ్లను తీసుకొచ్చిన నాయకుడు కేసీఆర్ అని కొనియాడారు. 420 హామీలతో ప్రజలను మోసం చేసిన ఘనత కాంగ్రెస్ పార్టీదేనని, ఒక్కో హామీకి సోనియా, ప్రియాంక, రాహుల్ గాంధీల మీద ఒట్టేసి ప్రజలను నమ్మించి మోసం చేశారని విమర్శించారు.1970లో ముఖ్యమంత్రి కావాల్సిన నూకల రామచంద్రారెడ్డిని కాంగ్రెస్ పార్టీ మరచిపోయినా, కేసీఆర్ గుర్తించి ఆయన విగ్రహాన్ని, స్మృతి చిహ్నాన్ని ఏర్పాటు చేశారని గుర్తు చేశారు. దేశంలో 3 శాతం జనాభా ఉన్న తెలంగాణ 30 శాతం ఆదర్శ గ్రామాలుగా జాతీయ అవార్డులు సాధించిందని, అది కేసీఆర్ పాలనలోనే సాధ్యమైందని అన్నారు.బిఆర్ఎస్ సర్పంచులు గ్రామాలను అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి ఆదర్శ గ్రామాలుగా తీర్చిదిద్దాలని, కాంగ్రెస్ నాయకులకు సవాల్ విసరాలని ఆయన పిలుపునిచ్చారు. మహబూబాబాద్ జిల్లా అభివృద్ధి ఘనత కేసీఆర్‌కే దక్కిందని, తాను గుంటూరులో విద్యనభ్యసించానని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తన అల్లుడిని ఆంధ్రప్రదేశ్ బీమవరం నుంచి తెచ్చుకున్నాడని ఎద్దేవా చేశారు.తిరుగు ప్రయాణంలో నూకల రామచంద్రారెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సన్మాన కార్యక్రమంలో మాజీ మంత్రి సత్యవతి రాథోడ్, ఎమ్మెల్సీ తక్కెళ్ళపల్లి రవీందర్ రావు, రాజ్యసభ సభ్యుడు వద్ది రాజు రవిచంద్ర, మాజీ ఎంపీలు కవిత, వినోద్ కుమార్, మాజీ ఎమ్మెల్యేలు శంకర్ నాయక్, రెడ్యా నాయక్, హరిప్రియ, బిఆర్ఎస్ రాష్ట్ర నేత రాకేష్ రెడ్డి, పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

## శ్రీ సత్యనారాయణ స్వామి దేవస్థానం వార్షికోత్సవం

-ప్రత్యేక పూజల్లో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్గాజుల



**రామారం, డిసెంబర్ 27(నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని గాజులరామారం డివిజన్ వెంకటాద్రి హిల్స్ (హెచ్.ఏ.ఎల్. కాలనీ)లోని శ్రీ సత్యనారాయణ స్వామి లక్ష్మీ దేవస్థానంలో 29వ వార్షికోత్సవం డిసెంబర్ 27న ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా కుత్బుల్లాపూర్ మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు శ్రీ కూన శ్రీశైలం గౌడ్ ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ దేవాలయం ఎంతో ప్రసిద్ధి చెందినదని, సత్యనారాయణ స్వామి వారి ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని ఆకాంక్షించారు. స్వామి దయ వల్ల ప్రజలందరూ సుఖశాంతులతో, ఆయురారోగ్యాలతో జీవించాలని ఆయన ప్రార్థించారు.ఈ కార్యక్రమంలో యువజన కాంగ్రెస్ నాయకులు సిహెచ్. బుచ్చిరెడ్డి, ఆలయ ధర్మకర్త గణేష్ సింగ్, సురేందర్ సింగ్, రాం నారాయణ, సుబ్బారాయుడు, వెంకట సుబ్బయ్య, యాదగిరి, రాజు పంతులు, ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొని వార్షికోత్సవాన్ని విజయవంతం చేశారు.

## ఆర్. కృష్ణయ్య, తీన్మార్ మల్లన్న ను కలిసిన ఎర్రోళ్ల రాఘవేందర్





**కడ్తాల్, డిసెంబర్ 27 ( నీలగిరి ఎక్స్ ప్రెస్)**
ఎంపీ,రాజ్య సభ సభ్యులు ఆర్ కృష్ణయ్యని, నల్గొండ, ఖమ్మం, వరంగల్ జిల్లాల ఎం ఎల్ సీ తీన్మార్ మల్లన్న ని శనివారం ఎర్రోళ్ల రాఘవేందర్ ఆధ్వర్యంలో మర్యాద పూర్వకంగా కలిశారు. కడ్తాల్ గ్రామ పంచాయతీ వార్డు సభ్యులు, నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి పంచాయితీ ఎన్నికల్లో వార్డుల లో విజయం సాధించిన విషయాన్నీ వారికీ వివరించారు.ఈ కార్యక్రమంలో 7వ వార్డు సభ్యులు కొప్పు వసంత, నాయకులు కొప్పు కృష్ణ, 8వ వార్డు సభ్యులు దుడ్డు పూలమ్మ,నాయకులు దుడ్డు నాగరాజు,వివేకానంద యూత్ అసోసియేషన్ అధ్యక్షులు సిలివేరు మాదవులు, సభ్యులు ఎర్రోళ్ల వెంకటేష్, దేరంగుల నాగార్జున, కేశని బాలకృష్ణ,వరికుప్పల మహేష్, వరికుప్పల సంజయ్, చుక్కని సందీప్, వరికుప్పల బాలకృష్ణ, యువకులు,నాయకులు, పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

## ఆమనగల్లును అభివృద్ధి చేసుకుందాం

- బీఆర్ఎస్ మున్సిపాలిటీ అధ్యక్షుడు పత్య నాయక్

**ఆమనగల్లు, డిసెంబర్ 27(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
బీఆర్ఎస్ పార్టీ బస్తీ బాట కార్యక్రమంలో భాగంగా ఆమనగల్లు మున్సిపాలిటీ 6వ వార్డు గుర్రం గుట్ట కాలనీలో మున్సిపాలిటీ అధ్యక్షులు పత్య నాయక్ మరియు బీఆర్ఎస్ శ్రేణులతో కలిసి వార్డులోని పురవీధుల గుండా తిరుగుతూ ప్రజల ద్వారా సమస్యలను అడిగితెలుసుకున్నారు.గుర్రం గుట్ట కాలనీ సమస్యలు నెరవేరాలన్న ఆమనగల్లు మున్సిపాలిటీ అభివృద్ధి చెందాలన్న బీఆర్ఎస్ పార్టీ మున్సిపాలిటీలో అధికారంలోకి రావాలన్నారు. గతంలో ఆమనగల్లు మున్సిపాలిటీలో బిజెపి పాలక వర్గానికి, అదేవిధంగా కాంగ్రెస్



ప్రభుత్వానికి అవకాశం ఇచ్చారు. బీఆర్ఎస్ పార్టీకి రాబోయే మున్సిపాలిటీ ఎన్నికల్లో అవకాశం ఇవ్వాలని తద్వారామున్సిపాలిటీలోని అన్ని వార్డులలో ఉన్న సమస్యలను పరి ష్కరించుకుని ఆమనగల్లు మున్సిపాలిటీని అభివృద్ధి చేసుకుందామని ఈ సందర్భంగా పత్య నాయక్ పిలుపి చ్చారు.కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు ఎంగళి రఘు, ఎనుముల రమేష్,బిఆర్ఎస్ పార్టీ యూత్ అధ్యక్షులు వడ్డే వెంకటేష్, వరికుప్పల గణేష్, కొమ్ము ప్రసాద్, తోట కృష్ణ యాదవ్, ఏఎంసీ మాజీ డైరెక్టర్ రమేష్ నాయక్, ఎస్టీ సెల్ అధ్యక్షులు రమేష్ నాయక్, ఎస్సీ సెల్ అధ్యక్షులు లండం యాదయ్య, వడ్డేమాన్ శివకుమార్, నిరంజన్, చాంద్ పాషా, జంతుక కిరణ్, మహేష్ నేత, శివ, లలితమ్మ, విమలమ్మ, అమృతమ్మ, వెంకటమ్మ, రాములు, శంకర్ నాయక్, గోపి, జంగయ్య, గణేష్ నాయక్, ఆంజనేయులు, గిరి, శ్రీకాంత్ నాయక్, రాములు, సుగుణమ్మ, భాగ్యమా, అలివేలు, అండాలు, ఈదమ్మ, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

# గురు గోవింద్ సింగ్ జయంతి వేడుకలు



**వరంగల్, డిసెంబర్ 27 (నీలగిరి ఎక్స్ ప్రెస్)**
కిషన్‌పురలోని గురు గోవింద్ సింగ్ మందిరంలో గురు గోవింద్ సింగ్ జయంతి సందర్భంగా ప్రత్యేక పూజలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వరంగల్ పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి హాజరై గురువారికి నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గురు గోవింద్ సింగ్ త్యాగం, ధైర్యం, సమానత్వ భావన సమాజానికి శాశ్వత ప్రేరణ అని పేర్కొన్నారు. అన్ని మతాల మధ్య సౌభ్రాతృత్వం, పరస్పర గౌరవం తెలంగాణ సంస్కృతికి ప్రతీకలని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అన్ని మతాల పండుగలను సమానంగా గౌరవిస్తూ అవసరమైన ఏర్పాట్లు చేస్తోందని తెలిపారు.పూజల అనంతరం సిక్కు సమాజ పెద్దలను పలకరించి జయంతి శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ జక్కుల రవీందర్, మాజీ కార్పొరేటర్ నాగరాజు, డివిజన్ అధ్యక్షుడు శివాజీ, సిక్కు సంఘ ప్రతినిధులు హర్మీందర్ సింగ్, రస్పల్ సింగ్, హర్పాల్ సింగ్, తరంజిత్ సింగ్, జస్వీందర్ సింగ్, అమన్దీప్ సింగ్ తదితరులు పాల్గొన్నారు.

# పోలీస్ కమిషనరేట్ వార్షిక నేర సమీక్ష




**కరీంనగర్, డిసెంబర్ 27 (నీలగిరి ఎక్స్ ప్రెస్)**
కరీంనగర్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో 2025 సంవత్సరానికి గాను నేరాల నియంత్రణలో విశేష పురోగతి సాధించామని కమిషనర్ గౌస్ ఆలం తెలిపారు. కమిషనరేట్ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన వార్షిక నివేదికను విడుదల చేశారు.గత ఏడాదితో పోలిస్తే ఈ ఏడాది మొత్తం నేరాలు 16.84 శాతం తగ్గాయని, ఘోర నేరాలు 9.09 శాతం తగ్గాయని, మహిళలపై నేరాలు 5.18 శాతం తగ్గాయని వెల్లడించారు. ఆస్తి నేరాల రికవరీలో 24 శాతం వృద్ధి సాధించి రూ.2.04 కోట్ల విలువైన సొత్తు స్వాధీనం చేసినట్లు తెలిపారు. సైబర్ నేరాలపై కఠిన చర్యలు తీసుకుంటూ 2,437 ఫిర్యాదులు అందగా 280 కేసులు నమోదు చేసి బాధితులకు రూ.1.10 కోట్లు తిరిగి అందజేశామని చెప్పారు. సీఈఐఆర్ పోర్టల్ ద్వారా 500కు పైగా మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసి యజమానులకు అందజేశారు. మహిళలు, పిల్లల భద్రత కోసం షి టీమ్స్, భరోసా కేంద్రాలు చురుగ్గా పనిచేశాయని, మానవ అక్రమ రవాణా నియంత్రణలో 9 మందిని రక్షించామని తెలిపారు. డ్రగ్స్ రహిత సమాజం కోసం 29 కిలోల గంజాయి స్వాధీనం చేసి, అక్రమ ఇసుక రవాణాపై 170 కేసులు నమోదు చేసినట్లు వివరించారు. ఎన్నికలు, పండుగలను ప్రశాంతంగా నిర్వహించామని, ప్రజల సహకారం మరువలేనిదని అన్నారు. ట్రాఫిక్ ఉల్లంఘనలపై 3.83 లక్షల ఈ-చలాన్లు, లేజర్ గన్ ద్వారా 17,491 కేసులు నమోదు చేసి రోడ్డు ప్రమాదాల్లో తగ్గుదల సాధించామని తెలిపారు. ప్రజా స్నేహిత పోలీసింగ్, ఆధునిక సాంకేతికత వినియోగంతో కరీంనగర్‌ను మరింత సురక్షిత నగరంగా తీర్చిదిద్దుతామని కమిషనర్ స్పష్టం చేశారు. ఈ సమావేశంలో అడిషనల్ డీసీపీలు వెంకటరమణ, భీంరావు, ఏసీపీలు వెంకటస్వామి, విజయకుమార్, రిజర్వు ఇన్స్పెక్టర్ కిరణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# ముగ్గుల పోటీలు



**కరీంనగర్, డిసెంబర్ 27 (నీలగిరి ఎక్స్ ప్రెస్)**
కిసాన్ నగర్ ఆర్యవైశ్య సంఘం, మహిళా సంఘం ఆధ్వర్యంలో ఆదివారం ముగ్గుల పోటీలు నిర్వహించనున్నట్లు సంఘం అధ్యక్షుడు దొంతుల మనోహర్, మహిళా సంఘం అధ్యక్షురాలు కైలాస నాగ శిరోమణి తెలిపారు.పాల్గొనేవారు ఉదయం తొమ్మిది గంటలకు దుర్గామాత ఆలయం వద్దకు హాజరుకావాలని సూచించారు. విజేతలకు మొదటి బహుమతిగా వెండి గిన్నె, రెండవ బహుమతిగా మిక్సీ, మూడవ బహుమతిగా కుక్కర్ ఇవ్వబడనుంది. అదనంగా 10 కన్సోలేషన్ బహుమతులు మరియు పాల్గొన్న ప్రతి మహిళకు బహుమతి అందజేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

# మత్తులో యువత చిత్తు





### గ్రామాల్లో అసాంఘిక కార్యకలాపాల అడ్డాలు

**ఆమనగల్లు, డిసెంబర్ 27 (నీలగిరి ఎక్స్ ప్రెస్)**
యువత మత్తులో చిత్తవుతుంది. మద్యం గంజాయి వంటి మత్తు పదార్థాలకు బానిసై బంగారు భవిష్యత్తును అంధకారంలోకి నెట్టుకుంటుంది. పట్టణాలలో కాకుండా మారుమూల గ్రామాల్లో సైతం ఈ పరిస్థితి నెలకొంది. రాత్రి సమయాలలో పాఠశాలల ఆవరణ, శివారు ప్రాంతాలు, రహదారులకు కొంచెం మరుగున ఉండే ప్రవేశాలు బెల్టు,మద్యం దుకాణాల సమీపం, మైదానాలు ఇలా పలుచోట్ల కొంతమంది యువకులు ఒక్కటై మద్యం తాగడం, గంజాయి పీల్చడం, వంటివి చేస్తూ వికృతి చేష్టలకు పాల్పడుతున్నారు.

**కొరవడిన నిఘాలి...**
పరిస్థితి ఇంత ముదిరి పోవడానికి ప్రధాన కారణం నిఘా కొ రవడటమే. అసాంఘిక కార్యకలాపాల నిర్వహణ జరిగే అడ్డాల మీద కన్నేస్తే కొంత మేరకైనా కట్టడి చేయొచ్చు. ఊరంతా బారే అన్నట్లుగా అడుగడుగునా దుకాణాలు ఉన్నాయి. రాత్రి పది గంటల ముందే వైన్ షాపులు మూసివేసిన గొలుసు దుకాణాలు మాత్రం కొనసాగుతూనే ఉన్నాయి. పోలీసులు రాత్రిపూట నామమాత్రంగా పెట్రోలింగ్ చేస్తుండడం కూడా ఒక కారణం. దీంతో ఆకతాయిలకు అడ్డు అదుపు లేకుండా పోతుంది.

**అంతా 20 ఏళ్ల లోపు వారే**
గంజాయి అంటే తెలియని యువకులే దీనికి ప్రధానంగా బానిసలు అవుతున్నారు. రెండు రోజుల క్రితం ఓ యువకుడు ఆర్టీసీ బస్సు లో గంజాయి తీసుకెళ్తూ పోలీసులకు చిక్కాడు.

# నట్టల నివారణ మందును సద్వినియోగం చేసుకోవాలి

-పశు వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి
-వ్యాధులను గుర్తించినట్లయితే తక్షణమే పశు వైద్యుల సూచనల మేరకు నివారణ చర్యలు చేపట్టాలి
-వెంకట్రావు పల్లె సర్పంచ్ కుల్ల పావని - యాకాంతం



**వర్ధన్నపేట, డిసెంబర్ 27(నీలగిరి ఎక్స్ ప్రెస్):**
నట్టల నివారణ మందును పశువుల పెంపకం దారులు సద్వినియోగం చేసుకోవాలని వెంకట్రావు పల్లె గ్రామ సర్పంచ్ కుల్ల పావని - యాకాంతం అన్నారు.వరంగల్ జిల్లా వర్ధన్నపేట మండలం వెంకట్రావు పల్లె గ్రామపంచాయతీ పరిధిలో పశు వైద్యుడు జూనియర్ వెటర్నరీ డాక్టర్ డి. శ్రీనివాస్ ఆధ్వర్యంలో గొర్రెలు మరియు మేకల కి ఉచిత నట్టల నివారణ మందుల పంపిణీ చేయడం జరిగినది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా గ్రామ సర్పంచ్ కుల్ల పావని - యాకాంతం మరియు గ్రామ ఉపసర్పంచ్ గొలుసుల మహేందర్ పాల్గొన్నారు. కార్యక్రమాన్ని ఉద్దేశించి సర్పంచ్ కుల్ల పావని - యాకాంతం మాట్లాడుతూ గొర్రెల పెంపకదారులు జీవాలకి సకాలంలో నట్టల మందులు వేసి పురుగులు, బద్దె పురుగులు ఇతర పరాన్న జీవులను నిర్మూలించాలి. ఇది జీవాల ఎదుగుదలకు తోడ్పడుతుంది. కావున ప్రభుత్వం పంపిణీ చేస్తున్న ఈ ఉచిత నట్టల నివారణ మందులను ఉపయోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో గొలుసుల వీరన్న, సాయిలు, సంపత్, మరియు గొర్రెల పెంపకదారులు మధ్యబోయిన కుమార్, ప్రవీణ్ లు పాల్గొన్నారు.

# నకిలీ ఏజెంట్ల మాటలు నమ్మకండి

### వీసా దరఖాస్తుదారులకు అమెరికన్ ఎంబసీ హెచ్చరిక




**న్యూఢిల్లీ- డిసెంబర్ 27 (నీలగిరి ఎక్స్ ప్రెస్)**
మీడియేటర్ల మాటలు నమ్మి మోసపోవద్దని, వీసా దరఖాస్తుదారులకు భారత్‌లోని అమెరికా రాయబార కార్యాలయం హెచ్చరికలు జారీ చేసింది. అమెరికా ఆంక్షల నేపథ్యంలో హెచ్-1బీ వీసా ప్రాసెసింగ్, రెన్యువల్స్ ఆలస్యమవుతుండటంపై యూఎస్ ఎంబసీ స్పందించింది. ఈ పరిస్థితిని అవకాశంగా తీసుకొని కొందరు నకిలీ ఏజెంట్లు మోసాలకు పాల్పడుతున్నారని పేర్కొంది. ఎలాంటి జాప్యాలకు తావు లేకుండా వీసా లభించేలా చూస్తామంటూ ఆ నకిలీ ఏజెంట్లు దరఖాస్తుదారుల్ని సంప్రదిస్తున్నారని అప్రమత్తం చేసింది. అలాంటి హామీలను నమ్మొద్దని, దానివల్ల ఆర్థికంగా నష్టం, ప్రయాణ ప్రణాళికల్లో ఇబ్బందులు తలెత్తవచ్చని ఎక్స్ వేదికగా అడ్వైజరీ జారీ చేసింది. వీసా అపాయింట్‌మెంట్లు అధికారిక వెబ్‌సైట్ల ద్వారానే షెడ్యూల్ అవుతాయని స్పష్టం చేసింది. ఈ ప్రక్రియ ద్వారా కాకుండా ఇతర మార్గాల్లో ఎవరైనా వీసా ఇప్పిస్తామంటే అది మోసం కిందికే వస్తుందని హెచ్చరించింది. అధికారిక ప్రక్రియలో భాగంగా పేర్కొన్న ఫీజు కంటే ఎక్కువ మొత్తం చెల్లించాల్సిన అవసరం లేదని సూచించింది. అమెరికా తీసుకొచ్చిన కొత్త సోషల్ మీడియా వెట్టింగ్ పాలసీ కారణంగా భారత హెచ్-1బీ దరఖాస్తుదారులు ఇబ్బంది పడుతోన్న సంగతి తెలిసిందే. దాని కారణంగా కొన్ని నెలల పాటు వీసా ఇంటర్వ్యూలు వాయిదా పడ్డాయి. ఈ వ్యవహారంపై మన దేశం ఆందోళన వ్యక్తం చేసింది. ఈ అంశంపై అమెరికా వర్గాలతో చర్చిస్తున్నట్లు విదేశీ వ్యవహారాల శాఖ అధికార ప్రతినిధి రణధీర్ జైస్వాల్ వెల్లడించిన సంగతి తెలిసిందే.

# ఢిల్లీలో వెరీ పూర్ కేటగిరీలో గాలి నాణ్యత..

**న్యూఢిల్లీ- డిసెంబర్ 27 (నీలగిరి ఎక్స్ ప్రెస్)**
దేశ రాజధాని ఢిల్లీలో గాలి కాలుష్యం తీవ్రంగా ఉంది. ఏక్యూఐ లెవెల్స్ రోజురోజుకూ ప్రమాదకరస్థాయిలోనే నమోదవుతున్నాయి. తాజాగా శనివారం ఉదయం కూడా ఢిల్లీలో వాయు కాలుష్యం వెరీ పూర్ కేటగిరీలో నమోదైంది. నగరంలో శనివారం ఓవరాల్ ఏక్యూఐ లెవెల్స్ 355గా నమోదయ్యాయి. నగరాన్ని ప్రమాదకరమైన పొగమంచు కమ్మేసింది.సెంట్రల్ పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ప్రకారం.. నగరంలో ఉదయం 9 గంటల సమయానికి గాలి నాణ్యత సూచిక 355గా నమోదైంది. కొన్ని ప్రాంతాల్లో 400కిపైగా నమోదయ్యాయి. ఆనంద్ విహార్‌లో 410, జహన్‌గిరిపురిలో 414, నరేలా ప్రాంతంలో 406, రోహిణి ప్రాంతంలో 406, షాదిపూర్ ప్రాంతంలో 408గా ఏక్యూఐ నమోదైంది. వీటితోపాటూ పలు ప్రాంతాల్లోనూ గాలి నాణ్యత అధ్వానస్థాయిలో నమోదైంది. దీనికితోడు నగరాన్ని దట్టమైన పొగమంచు కమ్మేయడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.సీజేఐ ఆందోళన.. మరోవైపు రాజధాని ప్రాంతంలో తీవ్ర కాలుష్యంపై భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ ఆందోళన వ్యక్తం చేసిన విషయం తెలిసిందే. ఈ కాలుష్య సంక్షోభానికి పర్యావరణ నిపుణులు సమర్థవంతమైన పరిష్కారాన్ని కొనుగొంటారని విశ్వాసం వ్యక్తం చేశారు. 'ఢిల్లీని పీడిస్తున్న వాయు కాలుష్య సమస్యను నివారించడానికి స్వల్పకాలిక ఉపశమనం కలిగించే విధానాల కంటే.. దీర్ఘకాలిక పరిష్కారం కోసం చర్యలు అవసరం. ప్రజారోగ్యానికి పెద్ద సవాలుగా మారుతున్న ఈ వాయు కాలుష్య సమస్యకు నిపుణులు పరిష్కారం కనుగొంటారని నాకు నమ్మకం ఉంది' అని అన్నారు.